
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం

జిల్లా వార్తలు

శనివారం 13 సెప్టెంబరు 2025



భారీ వర్షం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నగరంలో శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వర్షం కురిసింది. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజల మట్టాలు పెరిగేందుకు అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో శనివారం నగరంలో వర్షం కురుస్తుందని, ఒకటి, రెండుచోట్ల భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో క్యాన్సర్‌కు అత్యాధునిక వైద్యం

- ఇటీవల అందుబాటులోకి వచ్చిన రూ.45 కోట్ల విలువైన పరికరాలు
- రెండు రోజుల కిందట సేవలు ప్రారంభం




క్యాన్సర్ విభాగంలోని అత్యాధునిక వైద్య పరికరం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లోని క్యాన్సర్ విభాగంలో సుమారు రూ.45 కోట్లతో ఏర్పాటుచేసిన అత్యాధునిక వైద్య పరికరాలతో సేవలు ప్రారంభ మయ్యాయి. సిటీ సిమ్యులేటర్, లీనియర్ యాక్సిలేటర్, బ్రాకీ థెరపీ సహాయంతో రెండు రోజుల కిందట ఒకరికి విజయవంతంగా చికిత్స అందించినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి వెల్లడించారు. గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్న రోగికి చికిత్స అందించామన్నారు. కొత్త టెక్నాలజీతో క్యాన్సర్ కణితికి మాత్రమే రేడియేషన్ ఇచ్చి, చుట్టూ ఉన్న ఆరోగ్యకరమైన కణాలకు ఎలాంటి హాని కలగకుండా చూడవచ్చునన్నారు. దీనివల్ల తక్కువ దుష్ప్రభావాలతో, మెరుగైన ఫలితాలు లభిస్తాయని వైద్యులు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి మాట్లాడుతూ కేజీహెచ్‌లో కేన్సర్ చికిత్సకు సంబంధించి కొత్త అధ్యాయం మొదలైందన్నారు. ఈ అధునాతన సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ఈ అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి రావడంతో క్యాన్సర్ రోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలిగిందన్నారు.

గ్లాస్ బ్రిడ్జి ప్రారంభానికి సన్నాహాలు

- 22, 23 తేదీల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటీ మంత్రి చేతులమీదుగా ప్రారంభింపజేసేందుకు ఏర్పాట్లు
- టికెట్ ధర రూ.200...
- 5 నుంచి 7 నిమిషాలు సందర్శనకు అవకాశం



ప్రారంభానికి సిద్ధమైన కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కైలాసగిరిపై అందరినీ ఆకర్షిస్తున్న గ్లాస్ బ్రిడ్జి (అద్దాల వంతెన) మరో పది రోజుల్లో సందర్శకులకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు. పీపీపీ విధానంలో రూ.7 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కేంటీ లీవర్ అద్దాల వంతెన దేశంలోనే అతి పొడవైనది. దీనిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

... మిగతా 6వ పేజీలో

2047 నాటికి శత శాతం యూజీడీ

అన్ని ఇళ్లకూ కనెక్షన్

- పక్కా ప్రణాళికతో సాగుతున్న జీవీఎంసీ
- గ్రేటర్ పరిధిలో 3.6 లక్షల నివాస గృహాలు
- ప్రస్తుతం 1.9 లక్షల ఇళ్లకు భూగర్భ మురుగునీటి వ్యవస్థ కనెక్షన్
- మిగిలిన ఇళ్లకు దశల వారీగా...
- ప్రస్తుతం గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో రూ.400 కోట్లతో పనులు
- త్వరలో జోన్-2 పరిధిలో రూ.498 కోట్లతో శ్రీకారం
- మురుగునీటిని శుద్ధి చేసి, పరిశ్రమలకు విక్రయించే ఆలోచన

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్మార్ట్ సిటీగా గుర్తింపుపొందిన విశాఖలో 2047 నాటికి శతశాతం భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ) ఏర్పాటుచేయాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం దశల వారీగా కార్యాచరణను అమలు చేస్తోంది. నగరంలో సుమారు 3.6 లక్షల నివాస గృహాలుండగా ఇప్పటికే 1.9 లక్షల ఇళ్లకు యూజీడీ కనెక్షన్లు ఇవ్వడం జరిగింది. మరో 1.7 లక్షల ఇళ్లకు ఈ సదుపాయం కల్పించేందుకు అధికారులు కార్యాచరణ అమలు చేస్తున్నారు.



యూజీడీ పనులు పర్యవేక్షిస్తున్న సిబ్బంది

జీవీఎంసీ పరిధిలో సుమారు 5.35 లక్షల ఆస్తిపన్ను అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటిలో పరిశ్రమలు, కమర్షియల్, కార్యాలయాల భవనాలను మినహాయిస్తే సుమారు 3.6 లక్షల గృహాలుంటాయి. ఆయా ఇళ్లలో ఉత్పత్తి అయ్యే మురుగునీటిని నేరుగా డ్రైనేజీలు, గెడ్డల్లోకి విడిచిపెట్టినట్టయితే పారిశుధ్యం క్షీణించి, నగరవాసులను ఆరోగ్య సమస్యలు, అంటువ్యాధులు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి.ఈ పరిస్థితి రాకుండా జీవీఎంసీ భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ)ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో ప్రతి ఇంట్లోని మురుగునీరు, మరుగుదొడ్డి నీటిని పీవీసీ పైపు ద్వారా భూగర్భంలో వేసిన ప్రత్యేక పైపులోకి పంపిస్తారు. దానినుంచి మురుగునీరు నేరుగా పంప్‌హౌస్‌కు చేరి అక్కడ కొంత వడపోత తర్వాత ఎస్టీపీలకు చేరుతుంది. అక్కడ పూర్తిస్థాయిలో మలినాలు, రసాయనాలను వేరుచేస్తారు. ఇలా శుద్ధి చేసిన నీటిని పర్యావరణానికి ప్రమాదం లేకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తారు. దీనివల్ల ప్రజారోగ్యానికి భరోసా కల్పించడంతో పాటు సముద్ర కాలుష్యానికి చెక్ చెప్పే వీలుంది.

ప్రణాళికతో ముందుకు...

నగరంలో ప్రస్తుతం 3.6 లక్షల నివాసాలకుగాను 1.9 లక్షల ఇళ్లకు యూజీడీ సదుపాయం కల్పించారు. మిగిలిన ప్రాంతాల్లో యూజీడీ నెట్‌వర్క్ లేకపోవడంతో 1.7 లక్షల ఇళ్లకు కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో మురుగు నీరును నేరుగా డ్రైనేజీలోకి విడిచిపెడుతున్నారు. దీనివల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ పెందుర్తి పరిధిలో 15 వేల ఇళ్లకు యూజీడీ కనెక్షన్ కల్పించేందుకు రూ.289 కోట్లతో 226 కిలోమీటర్ల మేర యూజీడీ పైప్‌లైన్, 46

... మిగతా 6వ పేజీలో



నగరంలో జరుగుతున్న యూజీడీ పనులు

కనకమ్మ ఆలయంలో కలెక్టర్ తనిఖీలు

- పుస్తకాల్లో లెక్కలకు, స్టాక్ రూమ్‌లో ఉన్న సరకులకు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తింపు
- ఇంకోసారి తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- అన్నదానంలో నాణ్యత మెరుగుపడాలని హితవు



సరకుల నిల్వలు, రిజిస్టర్‌లో వాటి లెక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని కనకమహాలక్ష్మి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల అన్నదానం నాణ్యతపై ఆరోపణలు రావడం, రశీదుల పుస్తకం గల్లంతు కావడం, వెండి ఆభరణాల లెక్కలు పుస్తకాల్లో నమోదు చేయకపోవడం వంటి అంశాలతో ఈ ఆలయం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. దీంతో కలెక్టర్ తనిఖీ చేపట్టారు. అయితే ఆ సమయంలో ఈఓ శోభారాణి లేరు. ఆరా తీస్తే సెలవుపై వెళ్లారని సిబ్బంది సమాధానం ఇచ్చారు. క్యూలైన్లు, అన్న ప్రసాదం, సరకులు నిల్వ చేసే గది అన్నింటినీ కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. అన్నదానం, ప్రసాదాల్లో ఉపయోగించాల్సిన వస్తువులను కొందరు సిబ్బంది బయటకు తరలిస్తున్నారని ఆరోపణలు ఉండడంతో వాటిపై కూడా ఆయన దృష్టిపెట్టారు. స్టాక్ రూమ్‌లో ఉన్న

... మిగతా 6వ పేజీలో



స్టాపర్లను ఢీకొట్టిన కారు

-8లో

- నలుగురికి గాయాలు...ఇద్దరి పరిస్థితి విషయం
- షీలానగర్-కాన్వెంట్ జంక్షన్ రహదారిలో ప్రమాదం

నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

స్కూల్స్‌లోనూ అదే పరిస్థితి

- వేర్వేరుచోట్ల సంస్థల ఏర్పాటుకు అనుమతి తీసుకుని ఒకచోట తరగతులు
- పర్యవేక్షణ లేకపోవడంతో అడ్డగోలు వ్యవహారాలు
- భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులు లేకున్నా అనుమతులు
- గణనీయంగా పెరిగిన విద్యార్థుల సంఖ్య

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నర్సింగ్ కాలేజీలు, స్కూల్స్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. కనీస వసతులు, మౌలిక సదుపాయాలు లేకుండా, నిబంధనలు పాటించకుండానే నడుస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఒకచోట అనుమతి తీసుకుని మరోచోట కళాశాలలు, స్కూల్స్ నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి భారీగా దండుకుంటున్నాయి.

జిల్లాలో సుమారు 30 నర్సింగ్ స్కూల్స్, 25 వరకు నర్సింగ్ కాలేజీలు ఉన్నాయి. వీటిని ఏర్పాటుచేయాలంటే ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలి. సీట్ల సంఖ్యను బట్టి టీచింగ్ సిబ్బందిని నియమించాలి. నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సును 40 సీట్లతో నిర్వహించే కాలేజీలు తప్పనిసరిగా ఆరుగురు టీచింగ్ సిబ్బందిని నియమించుకోవాలి. సదరు కాలేజీకి పేరెంట్ హాస్పిటల్ ఉండాలి. లేకపోతే ఏదైనా ఆస్పత్రితో 30 ఏళ్లపాటు ఒప్పందం చేసుకోవాలి. సొంత భవనం లేదా 30 ఏళ్ల లీజు ఒప్పందం చేసుకున్న బిల్డింగ్ ఉండాలి. ముందుగా సొసైటీ ఏర్పాటుచేసి, దాని పేరుమీదే అనుమతులు తీసుకోవాలి. నర్సింగ్ స్కూల్స్ ఏర్పాటుకు కూడా ఈ తరహా అనుమతులు తప్పనిసరి. 30 సీట్లతో జీఎన్ఎం కోర్సును నిర్వహించాలనుకునే కాలేజీ తొమ్మిది మంది టీచింగ్ స్టాఫ్‌ను నియమించుకోవాలి. మిగిలిన నిబంధనలన్నీ పాటించాలి. అయితే ఈ అనుమతులు తీసుకుంటున్నప్పటికీ చాలాచోట్ల సరిపడా టీచింగ్ సిబ్బంది లేకుండానే నిర్వహిస్తున్నాయి. కొన్ని కాలేజీలకు కనీస భవనాలు లేవని చెబుతున్నారు.



మౌలిక సదుపాయాలు మృగ్యం

నగర పరిధిలోని ప్రముఖమైనవిగా గుర్తింపు తెచ్చుకున్న కొన్ని కాలేజీలు రెండుచోట్ల అనుమతులు తీసుకుని ఒక్కచోటే తరగతులను నిర్వహిస్తున్నాయి. వేపగుంటలో ఒకే దగ్గర రెండు కాలేజీలను నిర్వహిస్తున్నారు. అయితే దీనికి వేర్వేరు చోట్ల భవనాలను చూపించి అనుమతులు తీసుకున్నారు. ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలకు పాల్పడుతున్న కాలేజీలు మరిన్ని ఉన్నాయని సమాచారం. అంతేకాదు బోధనా సిబ్బంది తగినంతమంది లేని

... మిగతా 6వ పేజీలో



యునెస్కో తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భౌగోళిక వారసత్వ సంపదగా ప్రచారంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ఈ ఏడాది ఆగస్టు 27న యునెస్కో (యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్.. ఐక్యరాజ్యసమితి విద్య, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ) తాత్కాలిక జాబితాలో చేరాయి. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించదగిన వాటిలో ఎర్రమట్టి దిబ్బలు ఉంటాయని సంస్థ ఈ సందర్భంగా పేర్కొంది.

భీమునిపట్నం మండలం నేరేళ్లవలస పంచాయతీ సర్వే నంబరు 118 (పాత సర్వే నంబరు 49/1)లోని 1,067 ఎకరాల్లో ఎర్రమట్టి దిబ్బలు ఉండేవి. అందులో 588 ఎకరాలు ప్రభుత్వం తూర్పు నౌకాదళం ఏర్పాటు చేసిన

... మిగతా 6వ పేజీలో

నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపుపై నిర్లక్ష్యం

- పలు డిగ్రీ కళాశాలల్లో ఇతర రాష్ట్రాల విద్యార్థులకు అడ్మిషన్లు
- అందులో పలువురు నకిలీ ధ్రువపత్రాలు సమర్పిస్తున్నట్టు ఫిర్యాదులు
- ఇతర ప్రాంతాల వారి సర్టిఫికెట్లు తమకు పంపాలని గత నెల ఏయూ అధికారుల ఆదేశం
- ఆదేశాలను పట్టించుకోని కాలేజీలు



విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని పలు డిగ్రీ కాలేజీల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పదుల సంఖ్యలో చేరుతున్నారు. అయితే, ఈ తరహా ప్రవేశాలు పొందుతున్న వారిలో కొందరు ఫేక్ సర్టిఫికెట్లను సమర్పిస్తున్నారు. ఈ విషయమై వర్సిటీ అధికారులకు ఫిర్యాదులు రావడంతో ప్రత్యేకంగా దృష్టిసారించారు. గత నెల తొలి వారంలో దీనికి సంబంధించి ఏయూ సీడీసీ డీన్ కార్యాలయం నుంచి కీలక ఉత్తర్వులు వెలువడ్డాయి. 2022-23 విద్యా సంవత్సరంలో ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు

... మిగతా 6వ పేజీలో

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి



కేజీహెచ్‌లో విభాగాధిపతులు, అధికారులతో సమావేశమైన కలెక్టర్ హరేంధిర ప్రసాద్

- అంతా సమన్వయంతో పనిచేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలి
- అన్ని విభాగాల పనితీరు మెరుగుపడాలి
- కేజీహెచ్ అధికారులు, విభాగాధిపతులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్‌లో అధికారులు, వైద్యులు సమన్వయంతో పని చేసి రోగులకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ సూచించారు. శుక్రవారం ఉదయం కేజీహెచ్‌ను సందర్శించిన ఆయన పలు విభాగాధిపతులు, అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా ఉన్న అవసరాలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అంకాలజీ విభాగానికి 30 మంది స్టాఫ్ నర్సులు, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగానికి

... మిగతా 6వ పేజీలో



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఆర్‌డీఓ సంగీత్ మాథూర్

విద్యార్థులకు సౌట్స్ సర్టిఫికెట్లు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆర్‌డీఓ సంగీత్ మాథూర్ శుక్రవారం సౌట్స్, గైడ్స్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆ పాఠశాలలో హెచ్‌ఎం డి.శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివినప్పుడే ఉన్నత స్థితికి చేరుకుంటారని చెప్పారు. అనంతరం 8, 10వ తరగతులకు వెళ్లి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అలాగే తరగతి గదులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా కమిటీ చైర్మన్ బి. సోమేశ్వరరావు కంప్యూటర్ ల్యాబ్, డైనింగ్ హాలు, హ్యాండ్ బాల్ కోర్టులు నిర్మించాలని కోరుతూ ఆర్‌డీ ఓకి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహారావు ఉపాధ్యాయులు వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి, గంగరాజు, చంద్రమౌళి, రాజేశ్వరరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

రఘు కళాశాలలో రక్తదాన శిబిరం



రక్త దాతలతో నిర్వాహకులు

భీమునిపట్నం (రూరల్), సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాకమర్రి రఘు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం జరిగింది.ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ విజయనగరం, విశాఖ బ్రాంచ్‌లకు చెందిన వైద్యులు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థుల నుంచి 498 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె. రఘు, కరస్పాండెంట్ రమాదేవి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు విజయ్‌కుమార్, డా.జగదీశ్ పండా, డీన్ సతీశ్ చౌదరి, ఎన్‌సీసీ అధికారి కృష్ణకిశోర్, ఎన్ఎస్ఎస్ అధికారి వెంకటరెడ్డి, రెడ్‌క్రాస్ వైద్యులు కె. దివ్యవర్షిణి, రాము పాల్గొన్నారు.

పాడి సంపద పెంపునకు చర్యలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ గాడు వెంకటప్పడు, డైరెక్టర్లు, అధికారులు

తగరపువలస,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో మేలు జాతి పెయ్యి దూడలను పుట్టించి రైతులకు అందించనున్నట్టు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు తెలిపారు. శుక్రవారం ఆయన తగరపువలసలో పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ద్వారా పశు పోషకులకు గ్రామాల్లో పని చేస్తున్న గోపాలమిత్రల ద్వారా దూడ పెయ్యిలను అందిస్తామని చెప్పారు. మొదటి విడతగా వెయ్యి పెయ్యిలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దీనివల్ల జిల్లాలో పశు సంపద వృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్థక శాఖ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రసాద్, డిప్యూటీ డైరెక్టర్లు చంద్రశేఖర్, ప్రసాద్, భీమిలి మండల సహాయ డైరెక్టర్ రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీ అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీని సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు వారిని విచారించగా మరో బుకీ ఆచూకీ తెలిపారు.ఈమేరకు విజయనగరంలోని మంగలివీధికి చెందిన వెంకటేష్ (34)ను అరెస్టు చేశారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి గుంటూరు ఎస్పీ తీగెల రవీంద్రబాబు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళాన్ని దాత తరఫున స్థానిక చందనస్వామి కసిరెడ్డి సురేంద్రబాబు నగదు రూపంలో ప్రజా సంబంధాల అధికారి పి. సునీల్‌కు శుక్రవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత ప్రతినిధికి అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేష వస్త్రాన్ని, ప్రసాదాలను అందజేశారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



బేడా మండపంలో అమ్మవార్ల తిరువీధి

సింహాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవాలయంలో అమ్మవార్ల తిరువీధి ఉత్సవం శుక్రవారం రాత్రి సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సువర్ణ తాయార్, చతుర్భుజి అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు.ఆస్థాన విద్వాంసుల నాదస్వరాలపనలు, పండితుల వేదాశీర్వచనాలు నడుమ బేడా మండపంలో తిరువీధి జరిపారు. ఉత్సవంలో భాగంగా అష్టదిక్పాలకులకు ప్రత్యేక పూజలు, నివేదనలు చేశారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

... 5వ పేజీ తరువాయి

వైద్య పరికరాలు అవసరమని వైద్యులు చెప్పారు. ఎండోక్రైనాలజీ విభాగంలో లీకేజీలు ఉన్నా యని, మరమ్మతులు చేయాలని వైద్యులు కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడంలో మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమ యపాలన పాటించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. అన్ని విభాగాల్లో పనితీరు మరింత మెరుగుపడాలని స్పష్టంచేశారు. ఆస్పత్రిలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయం గురించి ప్రస్తావిస్తూ...డీఎంఈతో మాట్లాడి అక్కడి నుంచే విధులకు సంబంధించిన ఉత్తర్వులు వచ్చేలా చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. అప్పటివరకూ పాలనలో ఇబ్బందులు లేకుండా సమన్వయంతో ముందుకువెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో కేజీ హెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ చంద్రశేఖరంనాయుడు, డాక్టర్ వాసవీ లత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బంగారు నాయుడు, ఏడీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

‘డైట్’లో ముగిసిన కళా ఉత్సవ్

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థుల హాజరు
- రెండో రోజూ ఉత్సాహంగా సాగిన పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డైట్ ప్రిన్సిపాల్ సుధాకర్

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. రెండో రోజు చిత్రలేఖనం, శిల్పకళ, సంప్రదాయ కథలు, నాటిక పోటీలు నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఈ పోటీలను ప్రారంభించారు. 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా పెదబొడ్డేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం గొట్టేటి రవి, రాజాం హైస్కూల్ హెచ్‌ఎం కె. శారదా వ్యవహరించారు. నోడల్ అధికారిగా ఎం. ఆనంద్ రాజు వ్యవహరించారు. నాటిక పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్ఎస్, నడుపూరు (ప్రథమ), జడ్పీహెచ్ఎస్, ఆరిపాక (ద్వితీయ), జడ్పీహెచ్ఎస్, కాశీపురం (తృతీయ) విద్యార్థులు గెలుపొందారు. చిత్రలేఖనం వ్యక్తిగత విభాగంలో శ్రీచైతన్య స్కూల్, గాజువాక (ప్రథమ), శ్రీప్రకాష్ విద్యానికేతన్, కాపులుప్పాడ (ద్వితీయ),జడ్పీహెచ్ఎస్, కణితి (తృతీయ) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. శిల్పకళల్లో వ్యక్తిగత విభాగంలో జడ్పీహెచ్ఎస్, నడుపూరు, పీఎస్ఎంహెచ్ స్కూల్, భీమిలి, ది సన్ స్కూల్, భీమిలి నిలిచాయి. గ్రూప్ విభాగంలో జడ్పీహెచ్ఎస్ ఆరిపాక, జడ్పీహెచ్ఎస్ ఎండాడ, జడ్పీహెచ్ఎస్ బోయపాలెం విజేతలుగా గెలిచారు. కథల పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్ఎస్, కాశీపురం (ప్రథమ), కేజీబీవీ, పద్మనాభం (ద్వితీయ), జడ్పీహెచ్ఎస్, ఆరిపాక (తృతీయ) గెలుపొందారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.

రక్షణ గోడ నిర్మాణంలో తాత్సారం ఎందుకు ?

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి బీచ్ రోడ్డులో తీరం కోతకు గురవ్వకుండా రక్షణ గోడ నిర్మించడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీరంలో రిటర్నింగ్ వాల్ నిర్మించాలని అధికారులను పలు మార్లు ఆదేశిస్తున్నా... పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటన్నారు. గత రెండు దశాబ్దాల్లో సముద్రం భీమిలి తీరంలో సుమారు 70 నుంచి 80 మీటర్లు ముందుకు వచ్చిందని పూర్వీకులు చెబుతున్నారన్నారు. తుపాన్లు, ప్రకృతి విపత్తులు సంభవించేటపుడు బోయవీధి, కొత్తపేట మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తీరంలో రక్షణ గోడ నిర్మించాలని ఆయన కోరారు.

కమనీయం అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం శుక్రవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఉంచారు.భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ధరల తగ్గుదలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న సెంట్రల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్

మహారాణిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా తీసుకువచ్చిన జీఎస్టీ విధానంలో అనేక దినసరి వస్తువుల ధరలు తగ్గుతాయని, వాటిపై వినియోగదారులకు అవగాహన అవసరమని జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ ఆఫ్ సెంట్రల్ ట్యాక్ ఎన్.శ్రీధర్ అన్నారు.శుక్రవారం ఆయన హోటల్ దసపల్లాలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జీఎస్టీ 2.0 సదస్సులో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని రకాల దినసరి వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గించిందని, దీనివల్ల పలు రకాల వస్తువుల ధరలు తగ్గాయని చెప్పారు. వీటిపై కొనుగోలుదారులకు అవగాహన లేకపోతే అమ్మకందారుడు అధిక ధరలకు విక్రయించి, దోపిడీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్ వర్మ, ఫ్యాప్సీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్‌కే సంగు, కె. మల్లికార్జునరావు, సీహెచ్ కిశక్షర్‌కుమార్ తది తరులు పాల్గొన్నారు.

8వ వార్డు సమస్యలపై ఎమ్మెల్యే గంటాకు వినతి



ఎమ్మెల్యే గంటాకు వినతిపత్రం అందిస్తున్న గోపి

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు ఆ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యేను నగరంలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండాడలో సర్వే నెంబర్ 1లో నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 296 ప్రకారం రిజిస్ట్రేషన్లు కావడం లేదని, రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని విన్నవించారు. అలాగే రోడ్లు, వీధి లైట్లు, తదితర సమస్యలను కూడా పరిష్కరించాలన్నారు.

అర్చకుడు ఏవీఆర్‌ఎస్ శర్మ కన్నుమూత

పద్మనాభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొట్నూరు కోదండరామస్వామి,ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ అర్చకుడు అక్కాజ్యోషుల వెంకట రుష్యశృంగ శర్మ (ఏవీఆర్‌ఎస్ శర్మ) శుక్రవారం అనారోగ్యంతో కన్నుమూశారు.పొట్నూరు శర్మగా ప్రసిద్ధి గాంచిన ఆయన దేవస్థానంలో అర్చకత్వం చేస్తూనే విజయనగరం జిల్లాలోని కుమరాం, అట్టాడ గ్రామాల పురోహితుడిగా సేవలందించేవారు.సుపథ సేవా సంస్థ ద్వారా విద్యార్థులతో నైతిక విద్య బోధనకు ప్రతిభా పరీక్షలు నిర్వహించేవారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. పద్మనాభం ఆలయ ఈఓ నానాజీబాబు ఆయన కుటుంబ సభ్యులకు దేవస్థానం తరఫున దహన సంస్కారం నిమిత్తం రూ.10 వేలు ఇచ్చారు.

వృద్ధుడ్ని మోసగించిన కేసులో మరొకరి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన వృద్ధుడ్ని సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ1.6 కోట్లు దోచుకున్న కేసులో సైబర్ క్రైం పోలీసులు మరొకర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వృద్ధుడికి ఈఏడాది జూన్ 29న తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది, బ్లూడార్ట్ కొరియర్ సర్వీసు నుంచి మాట్లాడుతున్నామంటూ ముంబై నుంచి తైవాన్‌కి మీ పేరుతో పార్శిల్ బుక్ అయ్యిందని, అందులో నిషేధిత వస్తువులు ఉన్నాయని చెప్పారు. వెంటనే మరొకరు కాల్ చేసి ముంబై పోలీసు అధికారినంటూ పరిచయం చేసుకుని మీ అకౌంట్ల ద్వారా ఆర్థిక నేరాలు జరిగాయని బెదిరించి రూ. 1.60 కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ఇప్పటికే తెలంగాణ రాష్ట్రానికి చెందిన నలుగుర్ని అరెస్టు చేయగా, తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాకు చెందిన ఆకాశ్ యాదవ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిల కోసం పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్న సన్నిధిలో కేంద్ర మాజీ మంత్రి దిలీప్ రే



సింహాచలం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):వరాహలక్ష్మీనృసింహస్వామిని కేంద్ర మాజీ మంత్రి దిలీప్ రే శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ పర్యవేక్షణాధికారి సత్యశ్రీనివాస్ ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకున్న దిలీప్ రే దంపతులు గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

గీతం విద్యార్థులకు భారీ వేతనంతో ఉద్యోగాలు

సాగర్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఐటీ సంస్థ మైక్రాన్ గీతంలో ఎమ్మెస్సీ చదువు తున్న విద్యార్థులకు భారీ వేతనంతో ఉద్యోగాలకు ఎంపిక చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. వేదవతి తెలిపారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఎమ్మెస్సీ ఆఖరి సంవత్సరం చదువుతున్న ఎస్. లహరి మోహన్, ఎం. వర్షిణి, పి. భవాని, కె. హర్షవర్ధన్‌రెడ్డి, ఎన్. మనోజ్ రూ. 12. 26 లక్షల వార్షిక వేతనంతో మైక్రాన్ సంస్థలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను కంప్యూటర్ సైన్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ టి. ఉమాదేవి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి మునునూరి సూర్య శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. బీఎన్‌డబ్ల్యూ, ది సన్ స్కూల్ సంయుక్తంగా ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జ్ఞానవేణి

పద్మనాభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి కె. జ్ఞానవేణి చెప్పారు. శుక్రవారం ఆమె పాండ్రంగి ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్న పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉండడంతో వారిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అలాగే ప్రభుత్వం అవసరమైన మేర యూరియా సరఫరా చేస్తుందని, రైతులకు ఎటువంటి కొరత రానీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ మీనాకుమారి, ఆర్ఐ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

అనంతుని ఆలయానికి మైక్‌సెట్ బహూకరణ

పద్మనాభం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో గిరిపై ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయానికి మద్ది గ్రామానికి చెందిన కాళ్ల వెంకట సత్యనారాయణ మైక్ సెట్‌ను బహూకరించారు. ఆయన రూ. 40 వేలు తన సొంత నిధులు వెచ్చించి దీన్ని ఏర్పాటు చేశారు. మైక్ సెట్ ఏర్పాటుతో ఆలయానికి చెందిన ఆధ్యాత్మిక గీతాలు ప్రతిరోజూ భక్తులకు వినిపించడానికి సౌలభ్యంగా ఉంటుంది. అలాగే ఉత్సవాల సమయంలో భక్తులకు సమాచారం ఇవ్వడానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని వినతి

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. పెండింగ్‌లో వున్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు మహాలక్ష్మినాయుడు, ప్రధాన కార్యదర్శి కరుభుక్త సన్యాసినాయుడు, అర్బన్ ప్రధాన కార్యదర్శి ఆర్. కోటేశ్వరరావు, డి. దాలయ్యబాబు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట

కొమ్మాది, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్రనగర్ టైలర్స్ కాలనీలో విజయదుర్గాదేవి నవరాత్రిఉత్సవాల్లో భాగంగా ఆలయ ధర్మకర్తలు బంగారు లక్ష్మీ, సుబ్బారావు దంపతులు శుక్రవారం ఉడుపు రాట వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు శ్రీకాంత్ శర్మ, వైసీపీ నాయకులు పోతిన శ్రీను, హనుమంతు, వంకాయల మారుతీప్రసాద్, చేకూరి రజనీ, దాసరి వెంకటేశ్వరావు , తదితరులు పాల్గొన్నారు.

గ్లాస్ బ్రిడ్జి ప్రారంభానికి సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేతులమీదుగా ప్రారంభింపజేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. ఆ సమయంలోనే వారి చేతులు మీదుగా దీనిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. ఈ అద్దాల వంతెన పైకి వెళ్లి సముద్ర తీరం అందాలు చూడడానికి టికెట్ ధర రూ.200గా నిర్ణయించారని తెలిసింది. ఒక్కో పర్యాటకుడిని సుమారు 5 నుంచి 7 నిమిషాలు అనుమతిస్తారని అంటున్నారు. పర్యాటక శాఖ బీచ్ రోడ్డులో ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులకు కూడా ఇలాగే అధిక ధరలు పెట్టారు. పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 పెట్టగా సీఎం చంద్రబాబునాయుడు వాటిని పెద్దలకు రూ.250గా, పిల్లలకు రూ.100గా మార్చేశారు. దీనిపై విశాఖ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. అద్దాల వంతెన టికెట్ ధర కూడా అధికమని సీఎం భావిస్తే...దానిని కూడా తగ్గించే అవకాశం ఉంది.

2047 నాటికి శతశాతం యూజీడీ

... 5వ పేజీ తరువాయి

ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీ నిర్మాణాలను ప్రారంభించింది. ఈ పనులు చివరి దశకు చేరడంతో సుమారు 12 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చారు. అలాగే గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో 45 వేల నివాసాలకు యూజీడీ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.400 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇవి కూడా సగానికిపైగా పూర్తవడంతో 20 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చేశారు. ఆ రెండు ప్రాజెక్టులు పూర్తయితే మరో 40 వేల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంది.

సమకూరిన నిధులు

ఇవికాకుండా యూజీడీ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ అల్లిపురం, కంచరపాలెం, మురళీనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని కొన్ని నివాసాలకు కనెక్షన్ ఇవ్వలేదు. ఇందుకోసం నెట్‌వర్క్ గ్యాప్‌లను పూర్తిచేయాల్సి ఉంది. దీనిని అధిగమించేందుకు అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.55 కోట్లను అందించనుంది. ఇదికాకుండా జోన్-2 (మధురవాడ) పరిధిలోని 45 వేల నివాసాలకు యూజీడీ నెట్‌వర్క్ లేకపోవడంతో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రూ.498 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. వీటన్నింటి ద్వారా సుమారు లక్ష ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన 70 వేల ఇళ్లకు 2047 నాటికి ఈ సదుపాయం కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కార్యాచరణ రూపొందించారు.

శుద్ధి చేసిన నీరు విక్రయం

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని అవసరమైన మేరకు పరిశ్రమలు, వ్యవసాయానికి విక్రయించాలని ప్రతిపాదనలు తయారుచేశారు. ఇప్పటికే జీవీఎంసీ నుంచి ఎస్‌టీపీల్లో శుద్ధిచేసిన నీటిని హెచ్‌పీసీఎల్ కొనుగోలు చేస్తోంది. పోర్టు, నేవీ వంటి వాటికి 400 ఎంఎల్‌డీల నీటి డిమాండ్ ఉండడంతో 2047 నాటికి 200 ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని జీవీఎంసీ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపుపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సంబంధించి ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ వర్సిటీ పరిధిలోని 190 డిగ్రీ కాలేజీలకు సర్క్యులర్ జారీచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను గత నెల 20వ తేదీలోగా తమకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇప్పటివరకూ వాటిని ఆయా కాలేజీలు అందజేసిన దాఖలాలు లేవు. మరోవైపు సీడీసీ కార్యాలయ అధికారులు కూడా ఆ విషయం గురించి పట్టించుకోలేదు. ఆయా కాలేజీల నుంచి ఎంతమంది విద్యార్థులకు సంబంధించిన సమాచారం వచ్చిందన్నది కూడా ఇక్కడి అధికారులకు తెలియడం లేదంటే ఇచ్చిన ఉత్తర్వులు అమలును ఏ స్థాయిలో పర్యవేక్షిస్తున్నదీ ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అడ్డుకట్టే పడే చాన్స్.?

ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరిన ఏయూ అధికారులు 2022-23 విద్యా సంవత్సరానికి మాత్రమే పరిమితం కావడంపైనా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ తరువాత విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులను పట్టించుకోలేదు. పోనీ, ఇచ్చిన ఆదేశాలను పకడ్బందీగా అమలుచేసి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ ప్రవేశాల్లో ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలను కట్టడి చేసేందుకు అవకాశం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. ఏయూ అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల కొన్ని కాలేజీలు ఈ విద్యా సంవత్సరంలో కూడా ఈతరహా ప్రవేశాలు కల్పిస్తున్నాయంటున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

కనకమ్మ ఆలయంలో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

సరకులు, వాటి రిజిస్టర్లను పరిశీలించి, లెక్కల్లో తేడాలు ఉన్న విషయాన్ని గుర్తించి, సిబ్బందిని నిలదీశారు. ఆలయం ప్రైవేటు ఆస్తి కాదని, ప్రభుత్వ సంస్థ అని, లెక్కలు సరిగ్గా ఉండాలని,ఇంకోసారి తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రసాదాల నాణ్యతపై విమర్శలు ఉన్న నేపథ్యంలో త్వరలో జరగబోయే మార్గశిర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. క్యూలైన్లు అవపసరమైనన్ని ఏర్పాటుచేసి భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కల్పించాలన్నారు. అన్న ప్రసాదంలో నాణ్యత మెరుగుపడాలని సూచించారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ఆలయ ఈఈ వెంకట రమణ, ఏఈఓలు సమాధానాలిచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నామని ఈఈ వెంకట రమణ చెప్పగా పూర్తి ప్రతిపాదనలు తనకు సమర్పించాలని సూచించారు.

నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కాలేజీలు, స్కూల్స్ సంఖ్య ఎక్కువేనని చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇటీవల నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధిక నర్సింగ్ కోర్సులను నిర్వహించే సంస్థలు విశాఖలోనే ఉండడంతో ఇతర ప్రాంతాల విద్యార్థులు భారీగా ఇక్కడ చేరుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో యాజమాన్యాల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. కొన్నిచోట్ల విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి గదులను తీసుకుని అరకొర వసతుల మధ్య వాటిలోనే హాస్టల్స్ నిర్వహిస్తున్నారంటున్నారు. బస్సులు కూడా అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉండదని, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేస్తున్నారన్నారు. నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని అడ్డగోలు వ్యవహారాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

యునెస్కో తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు

... 5వ పేజీ తరువాయి

ఐఎన్ఎస్ కళింగకు కేటాయించింది. భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి మరో 373.95 ఎకరాలు ఇచ్చారు. మిగిలిన భూమిని వారసత్వ సంపదగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ భూములను ఆనుకొని పక్కనే ఉన్న జిరాయితీ భూముల్లో కూడా ఎర్రమట్టి దిబ్బలు ఉండగా వాటిలో రైతులు జీడి మామిడి తోటలు సాగు చేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు మూడేళ్ల క్రితం ఆ భూములను కొనుగోలు చేసి లేఅవుట్లు వేసుకున్నారు. పనిలో పనిగా ఎర్రమట్టి దిబ్బలను రాత్రి వేళల్లో తవ్వేసి రోజూ వందల లారీల మట్టిని అమ్ముకున్నారు. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేయడం, ఫిర్యాదులు చేయడం, పత్రికల్లో పతాక శీర్షికల్లో రావడంతో జనసేన అధినేత ఎన్నికలకు ముందు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. పర్యావరణ విధ్వంసకులకు అధికారులు సహకరించకూడదని కోరారు. ఎట్టకేలకు ఈ ఎర్రమట్టి దిబ్బలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించడానికి యునెస్కో ప్రాథమిక చర్యలు చేపట్టడం హర్షనీయమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. వీటి కోసం ఈఏఎస్ శర్మ, రాణీ శర్మ, ప్రొఫెసర్లు తిమ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు చాలా పోరాటం చేశారని గుర్తు చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

» ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.4.25 కోట్లతో నిర్మాణం


షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, పాల్గొన్న పలువురు టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో కోట్ల రూపాయలు విలువ చేసే స్థలంలో నిర్మించనున్న మల్టీప్లెక్స్ షాపింగ్ కాంపెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.4.25 కోట్లతో ఈ భారీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం జనసంచారంతో కళకలాడే ఈ నివాస ప్రాంతం కాలక్రమేణా నిరుపయోగంగా మారిపోవడం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడం, దీనిపై ఏడాది క్రితం హౌసింగ్ బోర్డు ఈ ప్రాంతంలో మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం, ఇందుకోసం స్థలాన్ని సిద్ధం చేయడం కూడా జరిగింది. కానీ నిధులు మంజూరై ఏడాది గడిచినా ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి హౌసింగ్ బోర్డు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు భారీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే కేవలం కేవలం షాపింగ్ కాంప్లెక్సు మాత్రమే కాకుండా ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా ఒక కల్యాణ మండపాన్ని కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు అధికారులతో పాటు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ, కూటమి నాయకులు బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, నారు గోపి, పల్లా ఉమారాణి, ముగడ వాసు, కె.మహేష్, యడ్ల కళ, కర్రి గౌరీ, వరలక్ష్మి, సన్యాసమ్మ పాల్గొన్నారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు


వినతులను స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సీసీపీ తెలిపారు. అందిన వినతులు, ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో అందించవచ్చని సీసీపీ వెల్లడించారు.

ద్విచక్ర వాహనాల సర్వీసింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ

కంచరపాలెం,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల వ్యవధి గల టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులు ఈ శిక్షణను పొందుటకు అర్హులు. శిక్షణను సెప్టెంబరు 20నుంచి ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. అభ్యర్థులరిజిస్ట్రేషన్స్ వివరాల కోసం స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రామకృష్ణ (ఫోన్: 9948768778)కు సంప్రదించాలని సూచించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘు నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల తొలగింపు ప్రక్రియను యాజమాన్యం కొనసాగిస్తోందని, ఈ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఇప్పుడు తొలగించడం సరికాదని అన్నారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తే కార్మిక నాయకులపై కేసులు బనాయిస్తు న్నారని ఆరోపించారు. ఇప్పటికైన యాజ మాన్యం వైఖరిని మార్చుకుని కార్మికులను న్యాయం చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 26, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వె ల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం

» మైమరిపించిన కేరళ, ఒడిస్సీ సంప్రదాయ నృత్యాలు


అనుపమ మోహన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం 17వ వైశాఖి నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మరకత మణిమయ, చేల ఉత్తుకాడు వెంకట కవి కృతులకు కేరళ కూచిపూడి కళాకారిణి డాక్టర్ పద్మిని కృష్ణన్ ప్రదర్శించిన నృత్యాలు మైమరిపించాయి. ఒడిస్సీ కళాకారిణి విద్యూషి కవిత ద్వివేది బృందం ప్రదర్శించిన పంచాక్షర స్తోత్రం, ఆదిశంకరాచార్యులు వచనం చేసిన ఓం నమశ్శివాయ శంకరాభరణం రాగం ఏకతాళం పల్లవి శుద్ధ నృత్యం ఆహూతులను రంజింపజేసింది. గీత గోవిందంలోని అష్టపది-నిందితి చందన, జయదేవ గీతగోవిందం నుంచి విష్ణావతారాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. తెలంగాణకు చెందిన ఒగ్గు రవికుమార్ బృందం ఒగ్గు డోలు విన్యాస ప్రదర్శనలకు ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. మల్లన్న, బీరప్ప కథలతో పాటు ఉత్సాహభరితమైన విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా కళాకారులకు, అతిథులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కేరళ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు, పద్మినీ కృష్ణన్‌కు వైశాఖి ఎక్సలెన్స్ అవార్డు, కవిత ద్వివేదికి నాట్యశ్రీ అవార్డు, ఒగ్గు రవికుమార్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ యువ పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్సవాలను విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ, ఆదాయ పన్నులశాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ మహ్మద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైశాఖి నృత్యోత్సవం దేశంలో ప్రముఖ సాంస్కృతిక వేదికగా గుర్తింపు పొందడం విశాఖకు గర్వకారణమన్నారు. కళలను భావితరాలకు అందిస్తున్న విక్రమ్‌గౌడ్‌ను అభినందించారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారిణులు

'నిరుద్యోగ ఆవేదన' సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

సిరిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరుద్యోగ ఆవేదన సదస్సు పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు మాట్లాడుతూ ఈ నెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగ ఆవేదన సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములు తీసుకొన్న కార్పొరేట్ కంపెనీలు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు ఎప్పటి నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొమరం సందీప్, హేమంత, ఉదయ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ డీడీ రమేశ్‌కు సత్కారం


రమేశ్‌కు సత్కరిస్తున్న సమాచార, పౌరసంబంధాల కార్యాలయం సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార, పౌర సంబంధాల శాఖ పరిధిలోని రాష్ట్ర సమాచార కేంద్రం సహాయ సంచాలకుడిగా పని చేస్తున్న దున్న రమేష్‌ను ఉపసంచాలకుగా పదోన్నతి లభించడంతో విజయవాడలోని కమిషనరేట్‌కు బదిలీ అయింది. ఈ నేపథ్యంలో విశాఖ కార్యాలయం నుంచి రిలీవ్ అయిన రమేష్‌కు శుక్రవారం సమాచార, పౌరసంబంధాల కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఉప సంచాలకుడు కె.సదారావు, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలపై పలకలు తొలగించి వ్యర్థాలను వదిలేశారు

» ఇళ్లల్లోకి సైతం వెళ్ల లేని పరిస్థితి


ఇళ్ల ముందే విడిచిపెట్టిన వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో పలు చోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే పనుల్లో చాలా నెమ్మదిగా చేపడుతుండడంతో స్థానికులకు కొన్ని ఇబ్బందులుతప్పడం లేదు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ధర్మశక్తినగర్‌లో కాలువల నిర్మాణానికి రెండు వారాల కిందట పై పలకలను తొలగించారు. కొన్ని చోట్ల కాలువలపై పలకలు తొలగించి, కనీసం ఆ వ్యర్థాలను కూడా తొలగించకుండా అక్కడే వదిలేశారు. దీంతో, ఇంట్లోకి వెళ్లడానికి దారి లేక ఆ ఇంట్లో నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 2025-28కిగాను నూతన మేనేజింగ్ కమిటీని నియమించారు. విశాఖ బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, చైర్మన్‌గా సి.బాలసతీష్, వైస్ చైర్మన్‌గా మురళీకృష్ణ పట్నాయక్, ట్రెజరర్‌గా జీవీ ప్రసాదరావు నియమితులయ్యారు. సభ్యులుగా రహ్మతుల్లా, డాక్టర్ సీహెచ్ స్వామినాయుడు, ప్రొఫెసర్ జ్యోతి స్వరూప్‌నాయర్, ప్రొఫెసర్ హరనాథరావు, ఎం.ఆల్తాఫ్, సుభోమయ బెనర్జీ, డాక్టర్ జి వాసవీలత నియమితులయ్యారు.

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు పందిరిరాట


పూజ నిర్వహిస్తున్న గాంధీనగర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల గాంధీనగర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం పందిరారాట మహోత్సవాన్ని పండితుల వేద మంత్రాలమధ్య ఘనంగా చేపట్టారు. గాంధీనగర్‌లో గల లలితాంబగుడి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, గ్రామాధ్యక్షుడు కాకి గంగరాజు, ప్రధాన కార్యదర్శి కుందిరి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు మోది అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 1986 నుంచిదేవీ శరన్నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా భారీ ఎత్తున పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. దశల వారీ ఆందోళన

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు నోటీసు అందజేసిన డిస్కమ్ జేఏసీ నాయకులు


ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు నోటీసు అందజేస్తున్న డిస్కమ్ జేఏసీ నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈపీడీసీఎల్‌లో ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడికి శుక్రవారం డిస్కమ్ జేఏసీ నాయకులు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. 1999 ఫిబ్రవరి1 నుంచి 2004 మధ్యకాలంలో చేరిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి జీపీఎస్ సౌకర్యం కల్పించాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు సంస్థ నుంచే నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన సీఎండీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్

అగనంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'భవిష్యత్తు తరానికి ఉపాధి అవకాశాల కల్పన' అనే అంశంపై శుక్రవారం సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్ పసుమర్తి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషిన్ లెర్నింగ్ రంగాల్లో ఇప్పుడున్న పరిణామాలు, భవిష్యత్తులో అవకాశాలు గురించి వివరించారు. ఇంటెలిజెన్స్ రంగంలో ఏ విధంగా నైపుణ్యం పెంచుకోవాలనే అంశాలపై వివరిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంట్రల్ నర్సరీలో అభివృద్ధి పనులు ప్రారంభం


సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీఎమ్మార్డీఏ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో నిర్వహిస్తున్న సెంట్రల్ నర్సరీలో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. వీఎమ్మార్డీఏ నిధులు రూ. 99.50 లక్షలలో నర్సరీ ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్, అంతర్గత నడక దారులు, బెంచీలు, కార్యాలయం గది, విద్యుత్ దీపాలు తదితర అభివృద్ధి పనులను ఇక్కడ చేపట్టారు. మొక్కల ప్రదర్శన, విక్రయ స్థలాన్ని అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ మధుసూదన్‌రావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ విశ్వనాథ్, సహాయక ఇంజనీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్‌వేర్ ఎగ్జిబిషన్

» 18వ తేదీ వరకూ రాయితీపై అమ్మకాలు


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

రామ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12 నుంచి 18 వరకు రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్ వేర్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బ్రాండ్ ఇండస్ వ్యాలీ ప్రాడక్ట్‌లు వండర్ చెఫ్ ప్రాడక్టులు తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు వనకూరి లక్ష్మి తెలిపారు. అలాగే అల్యూమినియం వంట పాత్రల ఎక్స్చేంజ్‌పై అదనపు తగ్గింపు ఇస్తున్నట్టు చెప్పారు. స్టీల్, కాస్ట్ ఐరెన్ ,సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు. గాజు, రాతి చెక్క వంటి పనిముట్లు, ఇతర ఆర్గానిక్ పనిముట్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు, వివిధ స్టాళ్లపై డిస్కౌంట్ ఉన్నాయని, ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చిరుదాన్యాలతో చేసిన చిరుతిండ్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు.అలాగే సందర్శకులకు లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్టు లక్ష్మి తెలిపారు.

జనాభా ప్రాతిపదికగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు : కేవీపీఎస్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను జనాభా ప్రాతిపదికన అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే తెరవాలని, డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయలను సరిచేయాలన్నారు.

వాల్తేరు రైల్వేలో ముగిసిన హిందీ పక్షోత్సవం


వివిధ పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేరు డివిజన్ నిర్వహించిన హిందీ పక్షోత్సవం శుక్రవారంతో ముగిసింది. రెండు వారాలపాటు జరిగిన వేడుకల్లో హిందీ వ్యాసం, నోట్ డ్రాఫ్టింగ్, వాక్చాతుర్యం, చిత్ర ఆధారిత వ్యాస రచన, అంత్యాక్షరి, శబ్దాక్షరి పోటీలతో పాటు డిపార్టుమెంటల్ కమ్యూనికేషన్ శిక్షణకు సంబంధించి వర్కుషాపు, హిందీ సెమినార్, కవిత్వ పఠనం వంటి అంశాలపై కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వే ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని అధికారిక బాష పట్ల నిబద్ధతను చాటిచెప్పారు.

ఈ క్రమంలో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వాల్తేరు డివిజన్ కల్చరల్ సంఘం 'వస్త్ర హరన్' నాటకం ప్రదర్శించడంతో పాటు హిందీ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ధ్రువపత్రాలు, బహుమతులను అందజేసి అభినందించారు. అలాగే కళాకారులు ప్రదర్శించిన నాటకం, ఆలపించిన గీతాలను కొనియాడారు. అనంతరం డీఆర్‌ఎం మాట్లాడుతూ వాల్తేరు రైల్వే చేపడుతున్న వివిధ ప్రచార కార్యక్రమాలు హిందీ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. అధికారిక భాషాభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బంది ప్రసంశిస్తూ హిందీ పక్షోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. అనంతరం హిందీ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం మనోజ్‌కుమార్ సాహు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు నివాసితుల వినతి
- అసెంబ్లీ సమావేశాల్లో సమస్య ప్రస్తావిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే


ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

సీతమ్మధార, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని, మంచినీటి సమస్యలను పరిష్కారించాలని కోరుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నాయకులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును సీతమ్మధారలో గల బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. టిడ్కో గృహాలు నిర్మించి ఎనిమిది సంవత్సరాలు దాటినప్పటికీ ఈ గృహాలకు మౌలిక సౌకర్యాలు కల్పించలేదని, లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు మంజురు చేసి రుణ వాయిదాలు కట్టించుకుంటున్నారన్నారు. లబ్ధిదారులు రుణాలు చెల్లించినప్పటికీ, రుణాలు భారీగా పెంచి లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ వారు వడ్డీలపై వడ్డీలు వేసి వాయిదాలు కట్టించుకుంటున్నారని, లేకపోతే గృహాలను జప్తు చేస్తామని అంటున్నారని ఎమ్మెల్యే వద్ద అవేదన వ్యక్తం చేశారు. గతంలో లాటరీ ద్వారా ఎంపికైన వారిని తొలగించి వారి స్థానంలో నవరత్నాల పేరుతో వైసీపీ ప్రభుత్వం కొత్త పేర్లు నమోదు చేయించిందని, వీటిని అదనుగా తీసుకొని దళారులు వేల రుపాయల్లో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల పొందిన వారందరికీ తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన కోసం ఇప్పటికే శాసనసభ కార్యదర్శికి ప్రశ్న పంపానని, ఈ నెల 18న ప్రశ్న నెంబర్ 6గా ఉందని, వర్షకాల సమావేశాల్లో అసెంబ్లీలో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు.. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులంతా సీతమ్మధార కూడలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే ఇంటి వరకు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడ్కో గృహల లబ్ధిదారులు, సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.పైడిరాజు, ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

గ్లాస్ బ్రిడ్జి ప్రారంభానికి సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేతులమీదుగా ప్రారంభింపజేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. ఆ సమయంలోనే వారి చేతులు మీదుగా దీనిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. ఈ అద్దాల వంతెన పైకి వెళ్లి సముద్ర తీరం అందాలు చూడడానికి టికెట్ ధర రూ.200గా నిర్ణయించారని తెలిసింది. ఒక్కో పర్యాటకుడిని సుమారు 5 నుంచి 7 నిమిషాలు అనుమతిస్తారని అంటున్నారు. పర్యాటక శాఖ బీచ్ రోడ్డులో ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులకు కూడా ఇలాగే అధిక ధరలు పెట్టారు. పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 పెట్టగా సీఎం చంద్రబాబునాయుడు వాటిని పెద్దలకు రూ.250గా, పిల్లలకు రూ.100గా మార్చేశారు. దీనిపై విశాఖ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. అద్దాల వంతెన టికెట్ ధర కూడా అధికమని సీఎం భావిస్తే...దానిని కూడా తగ్గించే అవకాశం ఉంది.

2047 నాటికి శతశాతం యూజీడీ

... 5వ పేజీ తరువాయి

ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీ నిర్మాణాలను ప్రారంభించింది. ఈ పనులు చివరి దశకు చేరడంతో సుమారు 12 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చారు. అలాగే గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో 45 వేల నివాసాలకు యూజీడీ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.400 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇవి కూడా సగానికిపైగా పూర్తవడంతో 20 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చేశారు.

సమకూరిన నిధులు

ఇవికాకుండా యూజీడీ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ అల్లిపురం, కంచరపాలెం, మురళీనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని కొన్ని నివాసాలకు కనెక్షన్ ఇవ్వలేదు. ఇందుకోసం నెట్‌వర్క్ గ్యాప్‌లను పూర్తిచేయాల్సి ఉంది. దీనిని అధిగమించేందుకు అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.55 కోట్లను అందించనుంది. ఇదికాకుండా జోన్-2 (మధురవాడ) పరిధిలోని 45 వేల నివాసాలకు యూజీడీ నెట్‌వర్క్ లేకపోవడంతో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రూ.498 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. వీటన్నింటి ద్వారా సుమారు లక్ష ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన 70 వేల ఇళ్లకు 2047 నాటికి ఈ సదుపాయం కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కార్యాచరణ రూపొందించారు.

శుద్ధి చేసిన నీరు విక్రయం

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని అవసరమైన మేరకు పరిశ్రమలు, వ్యవసాయానికి విక్రయించాలని ప్రతిపాదనలు తయారుచేశారు. ఇప్పటికే జీవీఎంసీ నుంచి ఎస్‌టీపీల్లో శుద్ధిచేసిన నీటిని హెచ్‌పీసీఎల్ కొనుగోలు చేస్తోంది. పోర్టు, నేవీ వంటి వాటికి 400 ఎంఎల్‌డీల నీటి డిమాండ్ ఉండడంతో 2047 నాటికి 200 ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని జీవీఎంసీ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

49వ వార్డులో జీవీఎంసీ అధికారులు, టీడీపీ నేతల పర్యటన

- వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, స్థానిక సమస్యలపై ఆరా


ఏఎస్సార్‌నగర్‌లో పునాది భాగంలో కుంగిన ఇల్లు

మురళీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 49వ వార్డు బర్మా క్యాంప్, ఏస్సార్ నగర్ కాలనీల్లో శుక్రవారం వార్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటరీ విభాగాల సిబ్బందితో కలిసి టీడీపీ వార్డు అధ్యక్షుడు సంగు శ్రీనివాసరావు పర్యటించారు. వార్డులోని కొండవాలు ప్రాంతాలు, గెడ్డ సమీప ప్రాంతాల వద్ద నివాసితుల ఇళ్లను పరిశీలించారు. ఏఎస్సార్‌నగర్‌లో వరుస వానలకు ఓ ఇంటి పునాది భాగం పూర్తిగా కుంగిపోయింది. ఆందోళనలో పడుతున్న నివాసితులతో శ్రీనివాసరావు మాట్లాడారు. తక్షణం సమస్యను విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లి తగిన రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే, వార్డులో శానిటేషన్ ఇబ్బందులు, దోమల బెడద వంటి సమస్యలను తక్షణం సిబ్బంది సాయంతో డ్రైనేజీల శుభ్రత పనులు చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ జరిగేల చర్యలు తీసుకున్నారు.

రైతుబజార్‌లో ఉచిత వైద్య శిబిరం


రైతులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. టయో ల్యాబ్స్ వైద్య సిబ్బంది వినియోగదారులకు షుగర్, బీపీ, కొలస్ట్రాల్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కార్పొరేటర్ సారిపల్లి

సీతంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పేర్కొన్నారు. నూతనం ఎన్నికైన టీడీపీ వార్డు అధ్యక్షుడు ఇసరపు వాసు, సెక్రటరీగా ఎన్నికైన దనాజీలకు సీతంపేట గురుద్వార్ కూడలిలో గల వెన్నెల ఫంక్షన్ హాలులో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, పథకాలను అందరికీ చేరేలా చూడాలని సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్


స్కూల్ గేమ్స్‌కు హాజరైనక్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ శాఖ (అండర్-19) నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్, నెట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఉత్సాహంగా జరిగాయని ఎస్‌జీఎఫ్‌ఐ ఉమ్మడి విశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి హేమలత తెలిపారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ఆవరణలోని బాక్సింగ్ హాలులో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన అండర్-19 బాక్సింగ్ పోటీల్లో సుమారు వంద మంది ప్రాతినిధ్యం వహించి ప్రతిభను ప్రదర్శించారన్నారు. అలాగే సెయింట్ పీటర్స్ హైస్కూల్ ప్రాంగణంలో అండర్-19 బాలుర బాలికల ఫుట్‌బాల్, నెట్‌బాల్ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొని నైపుణ్యం చూపారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూసిన క్రీడాకారులను ఉమ్మడి విశాఖ జిల్లా ఫుట్‌బాల్, నెట్‌బాల్ జట్లకు ఎంపిక చేశామన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.

కనకమ్మ ఆలయంలో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

సరకులు, వాటి రిజిస్టర్లను పరిశీలించి, లెక్కల్లో తేడాలు ఉన్న విషయాన్ని గుర్తించి, సిబ్బందిని నిలదీశారు. ఆలయం ప్రైవేటు ఆస్తి కాదని, ప్రభుత్వ సంస్థ అని, లెక్కలు సరిగ్గా ఉండాలని,ఇంకోసారి తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రసాదాల నాణ్యతపై విమర్శలు ఉన్న నేపథ్యంలో త్వరలో జరగబోయే మార్గశిర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. క్యూలైన్లు అవపసరమైనన్ని ఏర్పాటుచేసి భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కల్పించాలన్నారు. అన్న ప్రసాదంలో నాణ్యత మెరుగుపడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ఆలయ ఈఈ వెంకట రమణ, ఏఈఓలు సమాధానాలిచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నామని ఈఈ వెంకటరమణ చెప్పగా పూర్తి ప్రతిపాదనలు తనకు సమర్పించాలని సూచించారు.

నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కాలేజీలు, స్కూల్స్ సంఖ్య ఎక్కువేనని చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇటీవల నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధిక నర్సింగ్ కోర్సులను నిర్వహించే సంస్థలు విశాఖలోనే ఉండడంతో ఇతర ప్రాంతాల విద్యార్థులు భారీగా ఇక్కడ చేరుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో యాజమాన్యాల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. కొన్నిచోట్ల విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి గదులను తీసుకుని అరకొర వసతుల మధ్య వాటిలోనే హాస్టల్స్ నిర్వహిస్తున్నారంటున్నారు. బస్సులు కూడా అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉండదని, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేస్తున్నారన్నారు. నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని అడ్డగోలు వ్యవహారాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

'ప్రభుత్వ విధానాలతో విద్యా వ్యవస్థ నాశనం'

అల్లిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేసిందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన అల్లిపురంలోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ తాము అధికారంలోకి రాగానే 107, 108 జీవోలను రద్దు చేసి, మెడిసిన్‌లో పేద విద్యార్థులకు వంద శాతం కన్వీనర్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు పది మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని చెప్పారు. అలాగే సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేదని తెలిపారు. విద్యా సమస్యలపై శనివారం గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని, అనంతరం దశల వారీగా పోరాటం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శేఖర్, కోశాధికారి భవాని, సహాయ కార్యదర్శి హేమానంద్ పాల్గొన్నారు.

18న ప్రభుత్వ డ్రైవర్ల హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు

మహారాణిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు ఈనెల 18వ తేదీన జరగనున్నట్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జామి సత్యనారాయణ, కె. త్రినాథరావు తెలిపారు. శుక్రవారం వారు కలెక్టరేట్ జంక్షన్‌లో ఉన్న అసోసియేషన్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం సహకార శాఖ ఆదేశాల మేరకు 18న డైమాండ్ పార్కు వద్ద ఉన్న డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో సొసైటీ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు


గుడివాడ గురన్నాథ్ సర్కిల్‌లో గోతులు పడిన రోడ్డు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో పలు రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కృష్ణాగార్డెన్స్ నుంచి అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లే రోడ్డులో అడుగుకో గొయ్యి ఉంది.అలాగే గుడివాడ గురన్నాథ్ సర్కిల్ చుట్టూ ఉన్న రోడ్డులో కూడా పెద్ద పెద్ద గోతులు ఉన్నాయి. ఇక్కడ ఐదు అడుగుల మేర రోడ్డు పూర్తిగా పాడైంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి రోడ్లు ఛిద్రంగా మారుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అంబేడ్కర్ సర్కిల్‌కు వెళ్లే రోడ్డులో దుస్థితి

ధరల తగ్గుదలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్

మహారాణిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా తీసుకువచ్చిన జీఎస్టీ విధానంలో అనేక దినసరి వస్తువుల ధరలు తగ్గుతాయని, వాటిపై వినియోగదారులకు అవగాహన అవసరమని సెంట్రల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్. శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆయన హోటల్ దసపల్లాలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జీఎస్టీ 2.0 సదస్సులో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని రకాల దినసరి వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గించిందని, దీనివల్ల పలు వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. వీటిపై కొనుగోలుదారులకు అవగాహన లేకపోతే అమ్మకందారులు అధిక ధరలకు విక్రయించి, దోపిడీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్ వర్మ, ఫ్యాప్సీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్‌కే సంగు, కె. మల్లికార్జునరావు, సీహెచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతిని చాటి చెప్పేవి కళలే


బృందగానంలో ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేది కళలేనని విజయనగరం పట్టణానికి చెందిన డాక్టర్ కె. తిరుమలప్రసాద్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రెట్రో రాగాస్ అండ్ కళాంజలి సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రేయసి మనోహరి...వరించి చేరవే...ఘంటసాల అన్న గాన లహరి కార్యక్రమం జరిగింది. ప్రముఖ ఘంటసాల గాయకుడు కాళ్లూరి రాజేంద్రప్రసాద్, సీనియర్ గాయకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు, గంటి మురళీ జ్యోతి ప్రజ్వలన చేసి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం ఏదో ఒక ఒత్తిడితో సతమతమయ్యేవారికి కళలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ కళలను నేర్చుకోవాలని సూచించారు. డా. వెలిచేటి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కళల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం గాయనీ గాయకులు రామారావు, రామ నరసింహం, శ్రీనివాస్, ప్రకాశ్, మంగవేణి, జ్యోతి, శ్రియ తదితరులు అలనాటి పాటలను ఆలపించి వీక్షకుల మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో సన్‌మూర్తి, ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

... 5వ పేజీ తరువాయి

వైద్య పరికరాలు అవసరమని వైద్యులు చెప్పారు. ఎండోక్రైనాలజీ విభాగంలో లీకేజీలు ఉన్నాయని, మరమ్మతులు చేయాలని వైద్యులు కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడంలో మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. అన్ని విభాగాల్లో పనితీరు మరింత మెరుగుపడాలని స్పష్టంచేశారు. ఆస్పత్రిలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయంపై ప్రస్తావిస్తూ... డీఎంఈతో మాట్లాడి అక్కడి నుంచే విధులకు సంబంధించిన ఉత్తర్వులు వచ్చేలా చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. అప్పటివరకూ పాలనలో సమన్వయంతో ముందుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ చంద్రశేఖరనాయుడు, డాక్టర్ వాసవీలత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బంగారునాయుడు, ఏడీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీ అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీని సైబర్ క్రైం పోలీసులు శుక్రవా రం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు వారిని విచారించగా మరో బుకీ ఆచూకీ తెలిపారు. ఈమేరకు విజయనగరంలోని మంగలివీధికి చెందిన యెన్ని వెంకటేష్ (34)ను అరెస్టు చేశారు.

'డైట్'లో ముగిసిన కళా ఉత్సవ్


విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. రెండో రోజు చిత్ర లేఖనం, శిల్పకళ, సంప్రదాయ కథలు, నాటిక పోటీలు నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా పెదబొడ్డేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం గొట్టేటి రవి, రాజాం హైస్కూల్ హెచ్ఎం కె. శారదా వ్యవహరించారు. నోడల్ అధికారిగా ఎం. ఆనంద్‌రాజు వ్యవహరించారు. నాటిక పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్‌ఎస్, నడుపూరు (ప్రథమ), జడ్పీ హెచ్‌ఎస్, ఆరిపాక (ద్వితీయ), జడ్పీహెచ్‌ఎస్, కాశీపురం (తృతీయ) స్థానాల్లో గెలుపొందారు. చిత్రలేఖనం వ్యక్తిగత విభాగంలో శ్రీచైతన్య స్కూల్, గాజువాక (ప్రథమ), శ్రీప్రకాష్ విద్యా నికేతన్, కాపులుప్పాడ (ద్వితీయ), జడ్పీహెచ్‌ఎస్, కణితి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. శిల్ప కళల్లో వ్యక్తిగత విభాగంలో జడ్పీహెచ్‌ఎస్, నడుపూరు, పీఎంశ్రీ హెచ్ స్కూల్, భీమిలి, ది సన్ స్కూల్, భీమిలి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. గ్రూప్ విభాగంలో జడ్పీహెచ్‌ఎస్, ఆరిపాక, జడ్పీహెచ్‌ఎస్, ఎండాడ, జడ్పీహెచ్‌ఎస్, బోయపాలెం విజేతలుగా గెలిచారు. కథల పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్‌ఎస్, కాశీపురం (ప్రథమ), కేజీబీవీ, పద్మనాభం (ద్వితీయ), జడ్పీహెచ్‌ఎస్, ఆరిపాక (తృతీయ) గెలుపొందారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ఇచ్చారు.

నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపుపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సంబంధించి ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ వర్సిటీ పరిధిలోని 190 డిగ్రీ కాలేజీలకు సర్క్యులర్ జారీచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను గత నెల 20వ తేదీలోగా తమకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇప్పటివరకూ వాటిని ఆయా కాలేజీలు అందజేసిన దాఖలాలు లేవు. మరోవైపు సీడీసీ కార్యాలయ అధికారులు కూడా ఆ విషయం పట్టించుకోలేదు. ఆయా కాలేజీల నుంచి ఎంతమంది విద్యార్థులకు సంబంధించిన సమాచారం వచ్చిందన్నది కూడా అధికారులకు తెలియడం లేదంటే ఉత్తర్వులు అమలును ఏ స్థాయిలో పర్యవేక్షిస్తున్నదీ ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అడ్డుకట్టే పడే చాన్స్.?

ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరిన ఏయూ అధికారులు 2022-23 విద్యా సంవత్సరానికి మాత్రమే పరిమితం కావడంపైనా విమర్శలున్నాయి. ఆ తరువాత విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులను పట్టించుకోలేదు. పోనీ, ఇచ్చిన ఆదేశాలను పకడ్బందీగా అమలుచేసి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ ప్రవేశాల్లో ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలను కట్టడి చేసేందుకు అవకాశం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. ఏయూ అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల కొన్ని కాలేజీలు ఈ సారీ ఈ తరహా ప్రవేశాలు కల్పిస్తున్నాయంటున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

యునెస్కో తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు

... 5వ పేజీ తరువాయి

ఐఎన్‌ఎస్ కళింగకు కేటాయించింది. భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి మరో 373.95 ఎకరాలు ఇచ్చారు. మిగిలిన భూమిని వారసత్వ సంపదగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ భూములను ఆనుకొని పక్కనే ఉన్న జిరాయితీ భూముల్లో కూడా ఎర్రమట్టి దిబ్బలు ఉండగా వాటిలో రైతులు జీడి మామిడి తోటలు సాగు చేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు మూడేళ్ల క్రితం ఆ భూములను కొనుగోలు చేసి లేఅవుట్లు వేసుకున్నారు. ర్రమట్టి దిబ్బలను రాత్రి వేళల్లో తవ్వేసి రోజూ వందల లారీల మట్టిని అమ్ముకున్నారు. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేయడం, ఫిర్యాదులు చేయడం, పత్రికల్లో పతాక శీర్షికల్లో రావడంతో జనసేన అధినేత ఎన్నికలకు ముందు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. పర్యావరణ విధ్వంసకులకు అధికారులు సహకరించకూడదని కోరారు. ఎట్టకేలకు ఎర్రమట్టి దిబ్బలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించడానికి యునెస్కో ప్రాథమిక చర్యలు చేపట్టడం హర్షణీయమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. వీటి కోసం ఈఏఎస్ శర్మ, రాణీ శర్మ, ప్రొఫెసర్లు తిమ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు చాలా పోరాటం చేశారని గుర్తుచేశారు.

వృద్ధుడిని మోసగించిన కేసులో మరొకరి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన వృద్ధుడ్ని సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ1.6 కోట్లు దోచుకున్న కేసులో సైబర్ క్రైం పోలీసులు మరొకర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వృద్ధుడికి ఈఏడాది జూన్ 29న తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది, ముంబై నుంచి తైవాన్‌కి మీ పేరుతో పార్శిల్ బుక్ అయ్యిందని, అందులో నిషేధిత వస్తువులు ఉన్నాయన్నారు. వెంటనే మరొకరు కాల్ చేసి ముంబై పోలీసు అధికారినని మీ అకౌంట్ల ద్వారా ఆర్థిక నేరాలు జరిగాయని బెదిరించి రూ. 1.6 కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ఇప్పటికే నలుగుర్ని అరెస్టు చేయగా, తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాకు చెందిన ఆకాశ్ యాదవ్‌ను అరెస్టు చేశారు.

జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు



వినతులను స్వీకరిస్తున్న సీసీపీ ప్రభాకరరావు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరానికి 23 వినతులు వచ్చినట్టు జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ.ప్రభాకరరావు తెలిపారు. సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని సీసీపీ తెలిపారు. అందిన వినతులు, ఫిర్యాదులను నిర్దీత సమయంలో టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు తదితర వాటిని ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో అందించవచ్చని సీసీపీ వెల్లడించారు.

ద్విచక్ర వాహనాల సర్వీసింగ్‌లో మూడు నెలల ఉచిత శిక్షణ

కంచరపాలెం,సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మూడు నెలల వ్యవధి గల టూ వీలర్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి టి.చాముండేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణకు కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణులు ఈ శిక్షణను పొందుటకు అర్హులు. శిక్షణను సెప్టెంబరు 20నుంచి ప్రారంభించనున్నట్టు ఆయన తెలిపారు. అభ్యర్థులరిజిస్ట్రేషన్స్ వివరాల కోసం స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ డి.రామకృష్ణ (ఫోన్: 9948768778)కు సంప్రదించాలని సూచించారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల తొలగింపు ప్రక్రియను యాజమాన్యం కొనసాగిస్తోందని, ఈ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఇప్పుడు తొలగించడం సరికాదని అన్నారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తే కార్మిక నాయకులపై కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన యాజ మాన్యం వైఖరిని మార్చుకుని కార్మికులను న్యాయం చేయాలని కోరారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 26, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళ దుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమ దుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు బ్యాగ్

రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన

» ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.4.25 కోట్లతో నిర్మాణం



షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, పాల్గొన్న పలువురు టీడీపీ నాయకులు

వెంకోజీపాలెం, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 16వ వార్డు హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లో కోట్ల రూపాయలు విలువ చేసే స్థలంలో నిర్మించనున్న మల్టీప్లెక్స్ షాపింగ్ కాంపెక్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ నిధులు రూ.4.25 కోట్లతో ఈ భారీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం జనసంచారంతో కళకలాడే ఈ నివాస ప్రాంతం కాలక్రమేణా నిరుపయోగంగా మారిపోవడం, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడం, దీనిపై ఏడాది క్రితం హౌసింగ్ బోర్డు ఈ ప్రాంతంలో మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి నిధులను మంజూరు చేయడం, ఇందుకోసం స్థలాన్ని సిద్ధం చేయడం కూడా జరిగింది. కానీ నిధులు మంజూరై ఏడాది గడిచినా ఎటువంటి పనులు ప్రారంభించలేదు. ఈ విషయమై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి హౌసింగ్ బోర్డు అధికారులు స్పందించారు. ఎట్టకేలకు భారీ షాపింగ్ కాంప్లెక్సు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే కేవలం కేవలం షాపింగ్ కాంప్లెక్సు మాత్రమే కాకుండా ఈ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు ఉపయోగపడేలా ఒక కల్యాణ మండపాన్ని కూడా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు అధికారులతో పాటు 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ మొల్లి శోభ, కూటమి నాయకులు బోర ధనరెడ్డి, బుగత సత్యనారాయణ, అప్పారి గిరిబాబు, నారు గోపి, పల్లా ఉమారాణి, ముగడ వాసు, కె.మహేష్, యడ్ల క ళ, కర్రి గౌరీ, వరలక్ష్మి, సన్యాసమ్మ పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం

» మైమరిపించిన కేరళ, ఒడిస్సీ సంప్రదాయ నృత్యాలు



అనుపమ మోహన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం 17వ వైశాఖి నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మరకత మణిమయ, చేల ఉత్తుకాడు వెంకట కవి కృతులకు కేరళ కూచిపూడి కళాకారిణి డాక్టర్ పద్మిని కృష్ణన్ ప్రదర్శించిన నృత్యాలు మైమరిపించాయి. ఒడిస్సీ కళాకారిణి విద్యూషి కవిత ద్వివేది బృందం ప్రదర్శించిన పంచాక్షర స్తోత్రం, ఆదిశంకరాచార్యులు వచనం చేసిన ఓం నమశ్శివాయ శంకరాభరణం రాగం ఏకతాళం పల్లవి శుద్ధ నృత్యం ఆహూతులను రంజింపజేసింది. గీత గోవిందంలోని అష్టపది-నిందితి చందన, జయదేవ గీతగోవిందం నుంచి విష్ణావతారాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. తెలంగాణకు చెందిన ఒగ్గు రవికుమార్ బృందం ఒగ్గు డోలు విన్యాస ప్రదర్శనలకు ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. మల్లన్న, బీరప్ప కథలతో పాటు ఉత్సాహభరితమైన విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా కళాకారులకు, అతిథులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కేరళ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్సలెన్స్ అవార్డు, పద్మినీ కృష్ణన్‌కు వైశాఖి ఎక్సలెన్స్ అవార్డు, కవిత ద్వివేదికి నాట్యశ్రీ అవార్డు, ఒగ్గు రవికుమార్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ యువ పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్సవాలను విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ, ఆదాయ పన్నులశాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ మహ్మద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైశాఖి నృత్యోత్సవం దేశంలో ప్రముఖ సాంస్కృతిక వేదికగా గుర్తింపు పొందడం విశాఖకు గర్వకారణమన్నారు. కళలను భావితరాలకు అందిస్తున్న విక్రమ్‌గౌడ్‌ను అభినందించారు.



నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారిణులు

'నిరుద్యోగ ఆవేదన' సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నేతలు

సిరిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరుద్యోగ ఆవేదన సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి కె.అచ్యుతరావు మాట్లాడుతూ ఈ నెల 17న విజయవాడలో నిర్వహించనున్న నిరుద్యోగ ఆవేదన సదస్సుకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో నిరుద్యోగ యువత హాజరు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ భూములు తీసుకొన్న కార్పొరేట్ కంపెనీలు టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు ఎప్పటి నుంచి కార్యకలాపాలు ప్రారంభిస్తాయో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొమరం సందీప్, హేమంత, ఉదయ్, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

సమాచార శాఖ డీడీ రమేశ్‌కు సత్కారం



రమేశ్‌కు సత్కరిస్తున్న సమాచార, పౌరసంబంధాల కార్యాలయం సిబ్బంది

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సమాచార, పౌర సంబంధాల శాఖ పరిధిలోని రాష్ట్ర సమాచార కేంద్రం సహాయ సంచాలకుడిగా పని చేస్తున్న దున్న రమేష్‌ను ఉపసంచాలకుగా పదోన్నతి లభించడంతో విజయవాడలోని కమిషనరేట్‌కు బదిలీ అయింది. ఈ నేపథ్యంలో విశాఖ కార్యాలయం నుంచి రిలీవ్ అయిన రమేష్‌కు శుక్రవారం సమాచార, పౌరసంబంధాల కార్యాలయంలో అధికారులు, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఉప సంచాలకుడు కె.సదారావు, డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలపై పలకలు తొలగించి వ్యర్థాలను వదిలేశారు

» ఇళ్లల్లోకి సైతం వెళ్ల లేని పరిస్థితి



ఇళ్ల ముందే విడిచిపెట్టిన వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలో పలు చోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అయితే పనుల్లో చాలా నెమ్మదిగా చేపడుతుండడంతో స్థానికులకు కొన్ని ఇబ్బందులుతప్పడం లేదు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా కింది స్థాయి అధికారులు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ధర్మశక్తినగర్‌లో కాలువల నిర్మాణానికి రెండు వారాల కిందట పై పలకలను తొలగించారు. కొన్ని చోట్ల కాలువలపై పలకలు తొలగించి, కనీసం ఆ వ్యర్థాలను కూడా తొలగించకుండా అక్కడే వదిలేశారు. దీంతో, ఇంట్లోకి వెళ్లడానికి దారి లేక ఆ ఇంట్లో నివసిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి సమస్యలు ఎదురవకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ 2025-28కిగాను నూతన మేనేజింగ్ కమిటీని నియమించారు. విశాఖ బ్రాంచ్ ప్రెసిడెంట్‌గా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, ఛైర్మన్‌గా సి.బాలసతీష్, వైస్ చైర్మన్‌గా మురళీకృష్ణ పట్నాయక్, ట్రెజరర్‌గా జీవీ ప్రసాదరావు నియమితులయ్యారు. సభ్యులుగా రహ్మతుల్లా, డాక్టర్ సీహెచ్ స్వామినాయుడు, ప్రొఫెసర్ జ్యోతి స్వరూప్‌నాయర్, ప్రొఫెసర్ హరనాథరావు, ఎం.అల్తాఫ్, సుభోమయ బెనర్జీ, డాక్టర్ జి వాసవీలత నియమితులయ్యారు.

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలకు పందిరిరాట



పూజ నిర్వహిస్తున్న గాంధీనగర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ప్రతినిధులు

ఆరిలోవ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 11వ వార్డులో గల గాంధీనగర్ అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం పందిరారాట మహోత్సవాన్ని పండితుల వేద మంత్రాలమధ్య ఘనంగా చేపట్టారు. గాంధీనగర్‌లో గల లలితాంబగుడి ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ 11వ వార్డు ఇన్‌చార్జి రాగతి అచ్యుతరావు, గ్రామాధ్యక్షుడు కాకి గంగరాజు, ప్రధాన కార్యదర్శి కుందిరి కృష్ణ, టీడీపీ సీనియర్ నాయకులు మోది అప్పారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో 1986 నుంచిదేవీ శరన్నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ ఏడాది కూడా భారీ ఎత్తున పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే.. దశల వారీ ఆందోళన

» ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు నోటీసు అందజేసిన డిస్కమ్ జేఏసీ నాయకులు



ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు నోటీసు అందజేస్తున్న డిస్కమ్ జేఏసీ నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు ఈపీడీసీఎల్‌లో ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడికి శుక్రవారం డిస్కమ్ జేఏసీ నాయకులు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. 1999 ఫిబ్రవరి1 నుంచి 2004 మధ్యకాలంలో చేరిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి జీపీఎస్ సౌకర్యం కల్పించాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు సంస్థ నుంచే నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన సీఎండీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్



సదస్సులో మాట్లాడుతున్న ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్

అగనంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'భవిష్యత్తు తరానికి ఉపాధి అవకాశాల కల్పన' అనే అంశంపై శుక్రవారం సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్ పసుమర్తి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషిన్ లెర్నింగ్ రంగాల్లో ఇప్పుడున్న పరిణామాలు, భవిష్యత్తులో అవకాశాలు గురించి వివరించారు. ఇంటెలిజెన్స్ రంగంలో ఏ విధంగా నైపుణ్యం పెంచుకోవాలనే అంశాలపై వివరిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సెంట్రల్ నర్సరీలో అభివృద్ధి పనులు ప్రారంభం



సెంట్రల్ నర్సరీ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

ఎంవీపీ కాలనీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వీఎమ్మార్డీఏ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలో నిర్వహిస్తున్న సెంట్రల్ నర్సరీలో ఇటీవల పూర్తయిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం ప్రారంభించారు. వీఎమ్మార్డీఏ నిధులు రూ. 99.50 లక్షలలో నర్సరీ ప్రవేశ ద్వారం వద్ద ఆర్చ్, అంతర్గత నడక దారులు, బెంచీలు, కార్యాలయం గది, విద్యుత్ దీపాలు తదితర అభివృద్ధి పనులను ఇక్కడ చేపట్టారు. మొక్కల ప్రదర్శన, విక్రయ స్థలాన్ని అభివృద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో వీఎమ్మార్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్, 18వ వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ మధుసూదన్‌రావు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ విశ్వనాథ్, సహాయక ఇంజనీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్‌వేర్ ఎగ్జిబిషన్

» 18వ తేదీ వరకూ రాయితీపై అమ్మకాలు



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సందర్శకులు

రామ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12 నుంచి 18 వరకు రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్ వేర్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బ్రాండ్ ఇండస్ వ్యాలీ ప్రొడక్ట్‌లు వండర్ చెఫ్ ప్రొడక్టులు తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు వనకూరి లక్ష్మి తెలిపారు. అలాగే అల్యూమినియం వంట పాత్రల ఎక్స్ఛేంజ్‌పై అదనపు తగ్గింపు ఇస్తున్నట్టు చెప్పారు. స్టీల్, కాస్ట్ ఐరెన్ ,సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు. గాజు, రాతి చెక్క వంటి పనిముట్లు, ఇతర ఆర్గానిక్ పనిముట్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు, వివిధ స్టాళ్లపై డిస్కౌంట్ ఉన్నాయని, ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చిరుదాన్యాలతో చేసిన చిరుతిండ్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు.అలాగే సందర్శకులకు లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్టు లక్ష్మి తెలిపారు.

జనాభా ప్రాతిపదికగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు : కేవీపీఎస్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను జనాభా ప్రాతిపదికన అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంటు సీఐటీయూ కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే తెరవాలని, డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయలను సరిచేయాలన్నారు.

వాల్తేరు రైల్వేలో ముగిసిన హిందీ పక్షోత్సవం



వివిధ పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాల్తేరు డివిజన్ నిర్వహించిన హిందీ పక్షోత్సవం శుక్రవారంతో ముగిసింది. రెండు వారాలపాటు జరిగిన వేడుకల్లో హిందీ వ్యాసం, నోట్ డ్రాఫ్టింగ్, వాక్చాతుర్యం, చిత్ర ఆధారిత వ్యాస రచన, అంత్యాక్షరి, శబ్దాక్షరి పోటీలతో పాటు డిపార్టుమెంటల్ కమ్యూనికేషన్ శిక్షణకు సంబంధించి వర్కుషాపు, హిందీ సెమినార్, కవిత్వ పఠనం వంటి అంశాలపై కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పోటీల్లో రైల్వే ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని అధికారిక బాష పట్ల నిబద్ధతను చాటిచెప్పారు.

ఈ క్రమంలో శుక్రవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో వాల్తేరు డివిజన్ కల్చరల్ సంఘం 'వస్త్ర హరన్' నాటకం ప్రదర్శించడంతో పాటు హిందీ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమానికి డీఆర్ఎం లలిత్ బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ధ్రువపత్రాలు, బహుమతులను అందజేసి అభినందించారు. అలాగే కళాకారులు ప్రదర్శించిన నాటకం, ఆలపించిన గీతాలను కొనియాడారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ వాల్తేరు రైల్వే చేపడుతున్న వివిధ ప్రచార కార్యక్రమాలు హిందీ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. అధికారిక భాషాభివృద్ధికి కృషి చేస్తున్న సిబ్బంది ప్రసంశిస్తూ హిందీ పక్షోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన అధికారులు, ఉద్యోగులను అభినందించారు. అనంతరం హిందీ పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లలో మౌలిక వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు నివాసితుల వినతి
- అసెంబ్లీ సమావేశాల్లో సమస్య ప్రస్తావిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే

సీతమ్మధార, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : టిడ్కో గృహాలకు మౌలిక వసతులు కల్పించాలని, మంచినీటి సమస్యలను పరిష్కారించాలని కోరుతూ భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) నాయకులు ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును సీతమ్మధారలో గల బీజేపీ కార్యాలయంలో శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. టిడ్కో గృహాలు నిర్మించి ఎనిమిది సంవత్సరాలు దాటినప్పటికీ ఈ గృహాలకు మౌలిక సౌకర్యాలు కల్పించలేదని, లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు బ్యాంకులు రుణాలు మంజురు చేసి రుణ వాయిదాలు కట్టించుకుంటున్నారన్నారు. లబ్ధిదారులు రుణాలు చెల్లించినప్పటికీ, రుణాలు భారీగా పెంచి లబ్ధిదారులను ఇక్కట్లకు గురిచేస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. బ్యాంక్ వారు వడ్డీలపై వడ్డీలు వేసి వాయిదాలు కట్టించుకుంటున్నారని, లేకపోతే గృహాలను జప్తు చేస్తామని అంటున్నారని ఎమ్మెల్యే వద్ద అవేదన వ్యక్తం చేశారు. గతంలో లాటరీ ద్వారా ఎంపికైన వారిని తొలగించి వారి స్థానంలో నవరత్నాల పేరుతో వైసీపీ ప్రభుత్వం కొత్త పేర్లు నమోదు చేయించిందని, వీటిని అదనుగా తీసుకొని దళారులు వేల రుపాయల్లో వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ టిడ్కో ఇళ్లు పొందిన వారందరికీ తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పన కోసం ఇప్పటికే శాసనసభ కార్యదర్శికి ప్రశ్న పంపానని, ఈ నెల 18న ప్రశ్న నెంబర్ 6గా ఉందని, వర్షకాల సమావేశాల్లో అసెంబ్లీలో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు.. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులంతా సీతమ్మధార కూడలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే ఇంటి వరకు వెళ్లి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో టిడ్కో గృహల లబ్ధిదారులు, సీపీఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్కే రెహమాన్, పి.చంద్రశేఖర్, ఎం.పైడి రాజు, ఎస్.నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నేతలు

గ్లాస్ బ్రిడ్జి ప్రారంభానికి సన్నాహాలు

... 5వ పేజీ తరువాయి

చేతులమీదుగా ప్రారంభింపజేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 22, 23 తేదీల్లో నగరంలో జరగనున్న ఈ గవర్నెన్స్ జాతీయ సదస్సుకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. ఆ సమయంలోనే వారి చేతులు మీదుగా దీనిని ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాల సమాచారం. ఈ అద్దాల వంతెన పైకి వెళ్లి సముద్ర తీరం అందాలు చూడడానికి టికెట్ ధర రూ.200గా నిర్ణయించారని తెలిసింది. ఒక్కో పర్యాటకుడిని సుమారు 5 నుంచి 7 నిమిషాలు అనుమతిస్తారని అంటున్నారు. పర్యాటక శాఖ బీచ్ రోడ్డులో ప్రవేశపెట్టిన డబుల్ డెక్కర్ బస్సులకు కూడా ఇలాగే అధిక ధరలు పెట్టారు. పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.300 పెట్టగా సీఎం చంద్రబాబునాయుడు వాటిని పెద్దలకు రూ.250గా, పిల్లలకు రూ.100గా మార్చేశారు. దీనిపై విశాఖ ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. అద్దాల వంతెన టికెట్ ధర కూడా అధికమని సీఎం భావిస్తే...దానిని కూడా తగ్గించే అవకాశం ఉంది.

2047 నాటికి శతశాతం యూజీడీ

... 5వ పేజీ తరువాయి

ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఎస్‌టీపీ నిర్మాణాలను ప్రారంభించింది. ఈ పనులు చివరి దశకు చేరడంతో సుమారు 12 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చారు. అలాగే గాజువాక, మల్కాపురం ప్రాంతాల్లో 45 వేల నివాసాలకు యూజీడీ కనెక్షన్ ఇచ్చేందుకు రూ.400 కోట్లతో పనులు ప్రారంభించారు. ఇవి కూడా సగానికిపైగా పూర్తవడంతో 20 వేల నివాసాలకు కనెక్షన్‌లు ఇచ్చేశారు.

సమకూరిన నిధులు

ఇవికాకుండా యూజీడీ నెట్‌వర్క్ ఉన్నప్పటికీ అల్లిపురం, కంచరపాలెం, మురళీనగర్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని కొన్ని నివాసాలకు కనెక్షన్ ఇవ్వలేదు. ఇందుకోసం నెట్‌వర్క్ గ్యాప్‌లను పూర్తిచేయాల్సి ఉంది. దీనిని అధిగమించేందుకు అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం త్వరలో రూ.55 కోట్లను అందించనుంది. ఇదికాకుండా జోన్-2 (మధురవాడ) పరిధిలోని 45 వేల నివాసాలకు యూజీడీ నెట్‌వర్క్ లేకపోవడంతో ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ) రూ.498 కోట్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. వీటన్నింటి ద్వారా సుమారు లక్ష ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన 70 వేల ఇళ్లకు 2047 నాటికి ఈ సదుపాయం కల్పించాలని జీవీఎంసీ కమిషనర్ కార్యాచరణ రూపొందించారు.

శుద్ధి చేసిన నీరు విక్రయం

ఎస్టీపీల్లో శుద్ధి చేసిన నీటిని అవసరమైన మేరకు పరిశ్రమలు, వ్యవసాయానికి విక్రయించాలని ప్రతిపాదనలు తయారుచేశారు. ఇప్పటికే జీవీఎంసీ నుంచి ఎస్‌టీపీల్లో శుద్ధిచేసిన నీటిని హెచ్‌పీసీఎల్ కొనుగోలు చేస్తోంది. పోర్టు, నేవీ వంటి వాటికి 400 ఎంఎల్‌డీల నీటి డిమాండ్ ఉండడంతో 2047 నాటికి 200 ఎంఎల్‌డీ నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని జీవీఎంసీ కమిషనర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

49వ వార్డులో జీవీఎంసీ అధికారులు, టీడీపీ నేతల పర్యటన

- వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు, స్థానిక సమస్యలపై ఆరా

మురళీనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 49వ వార్డు బర్మా క్యాంప్, ఏస్సార్ నగర్ కాలనీల్లో శుక్రవారం వార్డు ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శానిటరీ విభాగాల సిబ్బందితో కలిసి టీడీపీ వార్డు అధ్యక్షుడు సంగు శ్రీనివాసరావు పర్యటించారు. వార్డులోని కొండవాలు ప్రాంతాలు, గెడ్డ సమీప ప్రాంతాల వద్ద నివాసితుల ఇళ్లను పరిశీలించారు. ఏఎస్సార్‌నగర్‌లో వరుస వానలకు ఓ ఇంటి పునాది భాగం పూర్తిగా కుంగిపోయింది. ఆందోళనలో పడుతున్న నివాసితులతో శ్రీనివాసరావు మాట్లాడారు. తక్షణం సమస్యను విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ రాజు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ దృష్టికి తీసుకెళ్లి తగిన రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే, వార్డులో శానిటేషన్ ఇబ్బందులు, దోమల బెడద వంటి సమస్యలను తక్షణం సిబ్బంది సాయంతో డ్రైనేజీల శుభ్రత పనులు చేయించి, దోమల నివారణకు ఫాగింగ్ జరిగేల చర్యలు తీసుకున్నారు.



ఏఎస్సార్‌నగర్‌లో పునాది భాగంలో కుంగిన ఇల్లు

రైతుబజార్‌లో ఉచిత వైద్య శిబిరం



రైతులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

అక్కయ్యపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. టయో ల్యాబ్స్ వైద్య సిబ్బంది వినియోగదారులకు షుగర్, బీపీ, కొలస్ట్రాల్ తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

కనకమ్మ ఆలయంలో కలెక్టర్ తనిఖీలు

... 5వ పేజీ తరువాయి

సరకులు, వాటి రిజిస్టర్లను పరిశీలించి, లెక్కల్లో తేడాలు ఉన్న విషయాన్ని గుర్తించి, సిబ్బందిని నిలదీశారు. ఆలయం ప్రైవేటు ఆస్తి కాదని, ప్రభుత్వ సంస్థ అని, లెక్కలు సరిగ్గా ఉండాలని,ఇంకోసారి తేడాలు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రసాదాల నాణ్యతపై విమర్శలు ఉన్న నేపథ్యంలో త్వరలో జరగబోయే మార్గశిర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. క్యూలైన్లు అవపసరమైనన్ని ఏర్పాటుచేసి భక్తులకు ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కల్పించాలన్నారు. అన్న ప్రసాదంలో నాణ్యత మెరుగుపడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకూడదని హెచ్చరించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు ఆలయ ఈఈ వెంకట రమణ, ఏఈఓలు సమాధానాలిచ్చారు. ఆలయ అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నామని ఈఈ వెంకటరమణ చెప్పగా పూర్తి ప్రతిపాదనలు తనకు సమర్పించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కార్పొరేటర్ సారిపల్లి

సీతంపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ చేరేలా కృషి చేయాలని 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పేర్కొన్నారు. నూతనం ఎన్నికైన టీడీపీ వార్డు అధ్యక్షుడు ఇసరపు వాసు, సెక్రటరీగా ఎన్నికైన దనాజీలకు సీతంపేట గురుద్వార్ కూడలిలో గల వెన్నెల ఫంక్షన్ హాలులో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా టీడీపీ వార్డు నాయకులతో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సేవలు, పథకాలను అందరికీ చేరేలా చూడాలని సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాష్ట్ర కార్యదర్శి లొడగల కృష్ణ, మాజీ కార్పొరేటర్ ఇసరపు వెంకటలక్ష్మి, వార్డు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్

విశాఖపట్నం, స్పోర్ట్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ శాఖ (అండర్-19) నిర్వహించిన జిల్లా స్థాయి బాక్సింగ్, నెట్‌బాల్, ఫుట్‌బాల్ పోటీలు కమ్ జిల్లా జట్టు ఎంపికలు ఉత్సాహంగా జరిగాయని ఎస్‌జీఎఫ్ఐ ఉమ్మడి విశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి హేమలత తెలిపారు. స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం ఆవరణలోని బాక్సింగ్ హాలులో ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన అండర్-19 బాక్సింగ్ పోటీల్లో సుమారు వంద మంది ప్రాతినిధ్యం వహించి ప్రతిభను ప్రదర్శించారన్నారు. అలాగే సెయింట్ పీటర్స్ హైస్కూల్ ప్రాంగణంలో అండర్-19 బాలుర బాలికల ఫుట్‌బాల్, నెట్‌బాల్ పోటీల్లో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొని నైపుణ్యం చూపారన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ చూసిన క్రీడాకారులను ఉమ్మడి విశాఖ జిల్లా ఫుట్‌బాల్, నెట్‌బాల్ జట్లకు ఎంపిక చేశామన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి టోర్నీలో పాల్గొంటారని తెలిపారు.



స్కూల్ గేమ్స్‌కు హాజరైన క్రీడాకారులు

నర్సింగ్ కాలేజీల ఇష్టారాజ్యం

... 5వ పేజీ తరువాయి

కాలేజీలు, స్కూల్స్ సంఖ్య ఎక్కువేనని చెబుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

ఇటీవల నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. రాష్ట్రంలో అత్యధిక నర్సింగ్ కోర్సులను నిర్వహించే సంస్థలు విశాఖలోనే ఉండడంతో ఇతర ప్రాంతాల విద్యార్థులు భారీగా ఇక్కడ చేరుతున్నారు. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో యాజమాన్యాల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది. కొన్నిచోట్ల విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్నపాటి గదులను తీసుకుని అరకొర వసతుల మధ్య వాటిలోనే హాస్టల్స్ నిర్వహిస్తున్నారంటున్నారు. బస్సులు కూడా అధ్వానంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. తమ సమస్యలను చెప్పుకునే అవకాశం ఉండదని, బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా చేస్తున్నారన్నారు. నర్సింగ్ స్కూల్స్, కాలేజీల్లో తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని అడ్డగోలు వ్యవహారాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

'ప్రభుత్వ విధానాలతో విద్యా వ్యవస్థ నాశనం'


అల్లిపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను నాశనం చేసిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు విమర్శించారు. శుక్రవారం ఆయన అల్లిపురంలోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ తాము అధికారంలోకి రాగానే 107, 108 జీవోలను రద్దు చేసి, మెడిసిన్‌లో పేద విద్యార్థులకు వంద శాతం కన్వీనర్ కోటాలో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పి, ఇప్పుడు పది మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం లేదని చెప్పారు. అలాగే సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేదని తెలిపారు. విద్యా సమస్యలపై శనివారం గుంటూరులో రాష్ట్ర స్థాయి సదస్సు జరుగుతుందని, అనంతరం దశల వారీగా పోరాటం చేస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి. శేఖర్, కోశాధికారి భవాని, సహాయ కార్యదర్శి హేమానంద్ పాల్గొన్నారు.

18న ప్రభుత్వ డ్రైవర్ల హౌస్ బిల్డింగ్ సొసైటీ ఎన్నికలు

మహారాణిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ డ్రైవర్ల మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు ఈనెల 18వ తేదీన జరగనున్నట్టు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జామి సత్యనారాయణ, కె. త్రినాథరావు తెలిపారు. శుక్రవారం వారు కలెక్టరేట్ జంక్షన్‌లో ఉన్న అసోసియేషన్ భవనంలో విలేకరులతో మాట్లాడారు. విశాఖపట్నం సహకార శాఖ ఆదేశాల మేరకు 18న డైమాండ్ పార్కు వద్ద ఉన్న డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి కార్యాలయంలో సొసైటీ సర్వసభ్య సమావేశం, ఎన్నికలు జరుగుతాయని చెప్పారు.

అధ్వాన రోడ్లతో అవస్థలు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో పలు రహదారులు గోతులతో అధ్వానంగా ఉన్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా కృష్ణాగార్డెన్స్ నుంచి అంబేద్కర్ సర్కిల్‌కు వెళ్లే రోడ్డులో అడుగుకో గొయ్యి ఉంది.అలాగే గుడివాడ గురన్నాథ్ సర్కిల్ చుట్టూ ఉన్న రోడ్డులో కూడా పెద్ద పెద్ద గోతులు ఉన్నాయి. ఇక్కడ ఐదు అడుగుల మేర రోడ్డు పూర్తిగా పాడైంది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి రోడ్లు చిధ్రంగా మారుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి రోడ్ల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



గుడివాడ గురన్నాథ్ సర్కిల్‌లో గోతులు పడిన రోడ్డు



అంబేద్కర్ సర్కిల్‌కు వెళ్లే రోడ్డులో దుస్థితి

ధరల తగ్గుదలపై అవగాహన అవసరం

మహారాణిపేట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొత్తగా తీసుకువచ్చిన జీఎస్టీ విధానంలో అనేక దినసరి వస్తువుల ధరలు తగ్గుతాయని, వాటిపై వినియోగదారులకు అవగాహన అవసరమని సెంట్రల్ ట్యాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఎన్. శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఆయన హోటల్ దసపల్లాలో ఆంధ్రప్రదేశ్ వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన జీఎస్టీ 2.0 సదస్సులో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొన్ని రకాల దినసరి వస్తువుల ధరలపై జీఎస్టీ తగ్గించిందని, దీనివల్ల పలు వస్తువుల ధరలు తగ్గుతాయని చెప్పారు. వీటిపై కొనుగోలుదారులకు అవగాహన లేకపోతే అమ్మకందారులు అధిక ధరలకు విక్రయించి, దోపిడీ చేసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వరప్రసాద్ వర్మ, ఫ్యాప్సీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఆర్కే సంగు, కె. మల్లికార్జునరావు, సీహెచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీధర్

మన సంస్కృతిని చాటి చెప్పేవి కళలే



బృందగానంలో ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మన సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేది కళలేనని విజయనగరం పట్టణానికి చెందిన డాక్టర్ కె. తిరుమలప్రసాద్ అన్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం రెట్రో రాగాస్ అండ్ కళాంజలి సంయుక్త ఆధ్వర్యంలో 'ప్రేయసి మనోహరి...వరించి చేరవే...ఘంటసాల అన్న గాన లహరి కార్యక్రమం జరిగింది. ప్రముఖ ఘంటసాల గాయకుడు కాకర్లారి రాజేంద్రప్రసాద్, సీనియర్ గాయకులు ఎంవీఆర్ నాగేశ్వరరావు, గంటి మురళీ జ్యోతి ప్రజ్వలన చేసి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుమల ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం ఏదో ఒక ఒత్తిడితో సతమతమయ్యేవారికి కళలు ఉపశమనం కలిగిస్తాయన్నారు. ప్రతిఒక్కరూ కళలను నేర్చుకోవాలని సూచించారు. డా. వెలిచేటి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కళల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం గాయనీ గాయకులు రామారావు, రామ నరసింహం, శ్రీనివాస్, ప్రకాశ్, మంగవేణి, జ్యోతి, శ్రియ తదితరులు అలనాటి పాటలను ఆలపించి వీక్షకుల మన్ననలు పొందారు. ఈ కార్యక్రమంలో సన్‌మూర్తి, ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలి

... 5వ పేజీ తరువాయి

వైద్య పరికరాలు అవసరమని వైద్యులు చెప్పారు. ఎండోక్రైనాలజీ విభాగంలో లీకేజీలు ఉన్నాయని, మరమ్మతులు చేయాలని వైద్యులు కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు సేవలు అందించడంలో మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. అన్ని విభాగాల్లో పనితీరు మరింత మెరుగుపడాలని స్పష్టంచేశారు. ఆస్పత్రిలో ఉన్నతాధికారుల మధ్య సమన్వయంపై ప్రస్తావిస్తూ... డీఎంఈతో మాట్లాడి అక్కడి నుంచే విధులకు సంబంధించిన ఉత్తర్వులు వచ్చేలా చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. అప్పటివరకూ పాలనలో సమన్వయంతో ముందుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో కేజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ బీవీ రమణ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ యు.శ్రీహరి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ చంద్రశేఖరనాయుడు, డాక్టర్ వాసవీలత, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ బంగారునాయుడు, ఏడీ సుమతి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీ అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో మరో బుకీని సైబర్ క్రైం పోలీసులు శుక్రవా రం అరెస్టు చేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసిన పోలీసులు వారిని విచారించగా మరో బుకీ ఆచూకీ తెలిపారు. ఈమేరకు విజయనగరంలోని మంగలివీధికి చెందిన యెన్ని వెంకటేష్ (34)ను అరెస్టు చేశారు.

'డైట్'లో ముగిసిన కళా ఉత్సవ్

భీమునిపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) రెండు రోజులుగా జరుగుతున్న ఉమ్మడి విశాఖ జిల్లాస్థాయి కళా ఉత్సవ్ శుక్రవారంతో ముగిసింది. రెండో రోజు చిత్ర లేఖనం, శిల్పకళ, సంప్రదాయ కథలు, నాటిక పోటీలు నిర్వహించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్. సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ఈ కార్యక్రమాలను ప్రారంభించారు. 25 పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు, 40 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా పెదబొడ్డేపల్లి హైస్కూల్ హెచ్‌ఎం గొట్టేటి రవి, రాజాం హైస్కూల్ హెచ్‌ఎం కె. శారదా వ్యవహరించారు. నోడల్ అధికారిగా ఎం. ఆనంద్‌రాజు వ్యవహరించారు. నాటిక పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్ఎస్, నడుపూరు (ప్రథమ), జడ్పీ హెచ్ఎస్, ఆరిపాక (ద్వితీయ), జడ్పీహెచ్ఎస్, కాశీపురం (తృతీయ) స్థానాల్లో గెలుపొందారు. చిత్రలేఖనం వ్యక్తిగత విభాగంలో శ్రీచైతన్య స్కూల్, గాజువాక (ప్రథమ), శ్రీప్రకాష్ విద్యా నికేతన్, కాపులుప్పాడ (ద్వితీయ), జడ్పీహెచ్ఎస్, కణితి (తృతీయ) స్థానాల్లో నిలిచారు. శిల్ప కళల్లో వ్యక్తిగత విభాగంలో జడ్పీహెచ్ఎస్, నడుపూరు, పీఎస్ఎంహెచ్ స్కూల్, భీమిలి, ది సన్ స్కూల్, భీమిలి మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. గ్రూప్ విభాగంలో జడ్పీహెచ్ఎస్, ఆరిపాక, జడ్పీహెచ్ఎస్, ఎండాడ, జడ్పీహెచ్ఎస్, బోయపాలెం విజేతలుగా గెలిచారు. కథల పోటీల్లో గ్రూపు విభాగంలో జడ్పీహెచ్ఎస్, కాశీపురం (ప్రథమ), కేజీబీవీ, పద్మనాభం (ద్వితీయ), జడ్పీహెచ్ఎస్, ఆరిపాక (తృతీయ) గెలుపొందారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు ఇచ్చారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అధ్యాపకులు

నకిలీ సర్టిఫికెట్ల గుర్తింపుపై నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

సంబంధించి ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ వర్సిటీ పరిధిలోని 190 డిగ్రీ కాలేజీలకు సర్క్యులర్ జారీచేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్లతో డిగ్రీ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లను గత నెల 20వ తేదీలోగా తమకు పంపాలని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇప్పటివరకూ వాటిని ఆయా కాలేజీలు అందజేసిన దాఖలాలు లేవు. మరోవైపు సీడీసీ కార్యాలయ అధికారులు కూడా ఆ విషయం పట్టించుకోలేదు. ఆయా కాలేజీల నుంచి ఎంతమంది విద్యార్థులకు సంబంధించిన సమాచారం వచ్చిందన్నది కూడా అధికారులకు తెలియడం లేదంటే ఉత్తర్వులు అమలును ఏ స్థాయిలో పర్యవేక్షిస్తున్నదీ ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

అడ్డుకట్టే పడే చాన్స్.?

ఈక్వెలెన్స్, జెన్యూనిటీ సర్టిఫికెట్లను సమర్పించాలని కోరిన ఏయూ అధికారులు 2022-23 విద్యా సంవత్సరానికి మాత్రమే పరిమితం కావడంపైనా విమర్శలున్నాయి. ఆ తరువాత విద్యా సంవత్సరాల్లో చేరిన విద్యార్థులను పట్టించుకోలేదు. పోనీ, ఇచ్చిన ఆదేశాలను పకడ్బందీగా అమలుచేసి ఉంటే ప్రస్తుతం జరుగుతున్న డిగ్రీ ప్రవేశాల్లో ఈ తరహా అడ్డగోలు వ్యవహారాలను కట్టడి చేసేందుకు అవకాశం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు. ఏయూ అధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోకపోవడం వల్ల కొన్ని కాలేజీలు ఈ సారీ ఈ తరహా ప్రవేశాలు కల్పిస్తున్నాయంటున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దృష్టిసారించి వీటికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

యునెస్కో తాత్కాలిక జాబితాలో ఎర్రమట్టి దిబ్బలు

... 5వ పేజీ తరువాయి

ఐఎన్ఎస్ కళింగకు కేటాయించింది. భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి మరో 373.95 ఎకరాలు ఇచ్చారు. మిగిలిన భూమిని వారసత్వ సంపదగా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. ఈ భూములను ఆనుకొని పక్కనే ఉన్న జిరాయితీ భూముల్లో కూడా ఎర్రమట్టి దిబ్బలు ఉండగా వాటిలో రైతులు జీడి మామిడి తోటలు సాగు చేసుకుంటున్నారు. వైసీపీ నాయకులు మూడేళ్ల క్రితం ఆ భూములను కొనుగోలు చేసి లేఅవుట్లు వేసుకున్నారు. ర్రమట్టి దిబ్బలను రాత్రి వేళల్లో తవ్వేసి రోజూ వందల లారీల మట్టిని అమ్ముకున్నారు. దీనిపై పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తంచేయడం, ఫిర్యాదులు చేయడం, పత్రికల్లో పతాక శీర్షికల్లో రావడంతో జనసేన అధినేత ఎన్నికలకు ముందు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. పర్యావరణ విధ్వంసకులకు అధికారులు సహకరించకూడదని కోరారు. ఎట్టకేలకు ఎర్రమట్టి దిబ్బలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించడానికి యునెస్కో ప్రాథమిక చర్యలు చేపట్టడం హర్షణీయమని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ అన్నారు. వీటి కోసం ఈఏఎస్ శర్మ, రాణీ శర్మ, ప్రొఫెసర్లు తిమ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు చాలా పోరాటం చేశారని గుర్తుచేశారు.

వృద్ధుడిని మోసగించిన కేసులో మరొకరి అరెస్టు

ఎండాడ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నగరానికి చెందిన వృద్ధుడ్ని సైబర్ నేరగాళ్లు మోసం చేసి రూ1.6 కోట్లు దోచుకున్న కేసులో సైబర్ క్రైం పోలీసులు మరొకర్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వృద్ధుడికి ఈఏడాది జూన్ 29న తెలియని నెంబర్ నుంచి కాల్ వచ్చింది, ముంబై నుంచి తైవాన్‌కి మీ పేరుతో పార్శిల్ బుక్ అయ్యిందని, అందులో నిషేధిత వస్తువులు ఉన్నాయన్నారు. వెంటనే మరొకరు కాల్ చేసి ముంబై పోలీసు అధికారినని మీ అకౌంట్ల ద్వారా ఆర్థిక నేరాలు జరిగాయని బెదిరించి రూ. 1.6 కోట్లు కొల్లగొట్టారు. ఈ కేసులో ఇప్పటికే నలుగుర్ని అరెస్టు చేయగా, తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని బరేలీ జిల్లాకు చెందిన ఆకాశ్ యాదవ్‌ను అరెస్టు చేశారు.



శబరిమల వెళుతున్న రమేశ్, నూకరాజు

కాలి నడకన శబరిమలకు

పెందుర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): పద్మనాభానికి చెందిన నువ్వా నూకరాజు, తాలడ రమేశ్ అయ్యప్ప దీక్ష చేపట్టి కాలి నడకన శబరిమల బయలుదేరారు. ఈ క్రమంలో శుక్రవారం వారిద్దరూ మండలంలోని రాంపురం వద్ద ఉన్న ఉమారామ లింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీక్ష స్వీకరించి కాలినడకన 40 రోజుల్లో శబరిమలకు చేరుకుని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటామని తలిపారు.

కార్మికనేతకు నివాళి

పెదగంట్యాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఉక్కు ఇంటక్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ కార్మిక నాయకుడు పులి అప్పలరెడ్డి వర్ధంతి కార్యక్రమం నెల్లిముక్కులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తిప్పల గురుమూర్తి రెడ్డి అప్పలరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పేదలకు వస్త్రాల పంపిణీ చేశారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పుల వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ట్రేడ్‌యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

తెలుగు మహిళ గాజువాక అధ్యక్షురాలిగా కనకభవాని



కనకభవాని

అగనంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గం తెలుగు మహిళ అధ్యక్షురాలిగా అగనంపూడికి చెందిన గొల్లవిల్లి కనకభవానిని నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కనకభవాని మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు సీఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేశ్‌కు, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు, నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాసరావుకు, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాట ఉత్సవం

గాజువాక, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 65వ వార్డు రాజీవ్ మార్గ్ ప్రాంతంలో దసర నవరాత్రుల రాట ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేసి రాట వేశారు. ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని నవ దుర్గా కమిటీ సభ్యులు తెలిపారు. పూజ కార్యక్రమంలో నాయకులు గోమాడ వాసు, బైపిల్లి గాంధీ, శరగడం కృష్ణ, చిన్న, శివ, పవన్, శ్రీనివాసరెడ్డి, అనిల్, భాస్కర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **అర్జున్ చక్రవర్తి** : జగదాంబ, రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం)
- **మదరాసి** : శ్రీకన్య
- **ది కంజూరింగ్-4** : శారద
- **ఘాటీ** : సంగం, లీలామహల్, కిన్నెర, వెంకటేశ్వర-2, గోకుల్, ముక్తాస్, మౌర్య (గోపాలపట్నం), ఊర్వశి (కంచరపాలెం), మోహిని (గాజువాక) లిఖిత (శ్రీహరిపురం)
- **పరదా** : లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీకన్య-2 (గాజువాక)
- **వార్-2** : రమాదేవి, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శరత్, కామేశ్వరి, సుకన్య (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **కూలీ** : వెంకటేశ్వర-1, శ్రీరామా, మినీ మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ),
- **మహావతార్ నరసింహ** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా),

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 15, టమాటా 26, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 24, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 34, బీరకాయలు 32, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 34, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది) 70, బరబాటి 30, ముల్లంగి 36, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 50, దోసకాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 70, కొబ్బరికాయ (పెద్దది) 35, బీన్స్ (పెన్సిల్) 64, కీరదోస 32, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 32, చిలగడదుంపలు 35, కంద 40, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 5, పాలకూర (కట్ట) 5, తోటకూర (కట్ట) 5, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 70.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	132
లైవ్ ధర	152
విత్ స్కిన్	274
స్కిన్‌లెస్	284



ఆటోనగర్ రహదారిపై గుంతల్లో నిలిచిపోయిన వర్షపునీరు



గోపాలపట్నం: అధ్వానంగా ఉన్న దుర్గానగర్ కాలనీ రహదారి



పెందుర్తి(రూరల్): గుంతలు పడిన కె.కోటపాడు రహదారి

ఛిద్రమైన రహదారులతో అవస్థలు

- గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆటోనగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురుస్తూనే ఉంది. దీంతో పలు రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. విద్యార్థులు, ఉద్యోగులు, రోడ్లపై చిరువర్తకులకు ఇబ్బందులు తప్పలేదు

రహదారులు అధ్వాన్నం

శుక్రవారం కురిసిన వర్షానికి పలు రహదారులపై నీరు నిలిచిపోవడంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. ఆటోనగర్ నుంచి 'ఈ-బ్లాకు', 'ఎఫ్-బ్లాకు' రహదారులు మరింత అధ్వానంగా ఉన్నాయి. దీంతో రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. యాదవ జగ్గరాజుపేట, శ్రీనివాస నగర్, పకీరుతఖ్యా, చినగంట్యాడ రహదారుల్లో ఉదయం నుంచి కురిసిన వర్షానికి పలు లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండి పోయింది.

పొంగి పొర్లిన చెరువు

పెందుర్తి రూరల్, (ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా శుక్రవారం కురిసిన వర్షానికి పినగాడి నాలుగు రోడ్ల కూడలికి ఎగువన ఉన్న చెరువు పొంగి రోడ్లపై నీరు నిలిచిపోయింది. దీంతో కె.కోటపాడుకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు వాహదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో చిన్న వర్షం కురిసినా వరద నీరు పెరిగిపోయి రోడ్లమీదకి వచ్చేస్తోంది. దీనికి తోడు వర్షపునీరు కూడా రోడ్లపై నిలిచిపోతోంది. రహదారిపై ఉన్న గుంతలు పూడ్చితే తప్పా తమకు ఇబ్బందులు తప్పవని స్థానికులు వాపోతున్నారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు స్పందించి రహదరిపై గుంతలు పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

పెందుర్తి, (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని శుక్రవారం ఉదయం కురిసిన వర్షానికి స్థానికంగా పలు జంక్షన్లు, పల్లపు ప్రాంతాల్లో జలమయం అయ్యాయి. దీంతో వాహనదారులు రాకపోకలు ఇబ్బందులు పడ్డారు. పల్లపు ప్రాంతాలను మెరక చేయించాలని, రహదారిపై మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరారు.

చినుకుపడితే చిత్తడే

గోపాలపట్నం, (ఆంధ్రజ్యోతి): చినుకుపడితే చిత్తడిగా మారుతున్న రహదారులతో ఏళ్లతరబడి కాలనీల్లో ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. 88వ వార్డు గవర జగ్గయ్యపాలెం గ్రామంలోని దుర్గానగర్ కాలనీకు వెళ్లే ప్రధాన రహదారి చాలా కాలంగా అభివృద్ధిలేక అధ్వానంగా మారింది. రాకపోకలు సాగించేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. వర్షం వస్తే మాత్రం రహదారి మొత్తం చిత్తడిగా మారుతోందని, అప్పుడప్పుడు వాహనాల టైర్లు బురదలో జారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కురిసని వర్షానికి కానీలోని రహదారి బురదమయంగా మారింది. ఇప్పటికైన అధికారులు, నేతలు దృష్టిసారించి దుర్గానగర్ కాలనీ రహదారి నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటుంది: ఎమ్మెల్యే గణబాబు



గోపాలపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజలకు ఎటువంటి కష్టమొచ్చిన కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికి నేపాల్ బాధితులను ఆదుకున్న తీరే నిదర్శనమని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. గోపాలపట్నంలోని ఆయన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేపాల్‌లో చిక్కుకున్న రాష్ట్ర ప్రజలను తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ స్పందించిన తీరు అభినంద నీయమన్నారు. చంద్రబాబు ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌లో సంభవించిన వరదల్లో చిక్కుకున్న బాధితులను ప్రత్యేక వి మానంలో తీసుకువచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. విదేశాల్లో రాష్ట్ర ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే వారిక సహాయం చేయడానికి చంద్రబాబు ముందుంటారని కొనియాడారు. ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌కే పరిమితమయ్యారన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

- పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి పేదలకు వరమని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధితులకు రూ.10.5 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. చెక్కులు తీసుకున్న వాళ్లలో అక్కిరెడ్డిపాలానికి చెందిన విష్ణువర్ధన్, చినముషిడివాడ, పోర్లుపాలెం, లంకెలపాలానికి చెందిన తమ్మినేని డిల్లేశ్వరరావు, సిరవరపు లీలాప్రశాంతి, శ్రీనివాసరావు ఉన్నారు. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ వైద్యఖర్చుల నిమిత్తం ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా సీఎం రిలీఫ్ ఫండ్ నిధులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకుల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్లాంట్‌లో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల తొలగింపు ప్రక్రియను యాజమాన్యం కొనసాగిస్తోందని, ఈ ప్రక్రియను నిలిపివేయాలన్నారు. ఎన్నో ఏళ్లగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను ఇప్పుడు తొలగించడం సరికాదని అన్నారు. యాజమాన్యం వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేస్తే కార్మిక నాయకులపై కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైన యాజమాన్యం వైఖరిని మార్చుకుని కార్మికులను నాయ్యయం చేయాలని కోరారు.

'మిషన్ శక్తి' పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శిశు సంక్షేమ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మహిళలు విద్యావంతులైతనే తన కుంటుబంతో పాటు సమాజాన్ని కూడా చైతన్యవంతం చేయగలరని మహిళా శిశుసంక్షేమ శాఖ సూపర్‌వైజర్ రుక్సానా బేగం అన్నారు. 'మిషన్ శక్తి' కార్యక్రమాన్ని శుక్రవారం అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బాలిక సంరక్షణ-అభివృద్ధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికలు చదువు ఆవశ్యకతను తెలుసుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఎంఎల్‌ఎస్ కాంతం మాట్లాడుతూ బాలికల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బందితో పాటు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ప్రయాణంలో జాగ్రత్తలు పాటించాలి

- ఆర్‌పీఎఫ్ సీఐ బి.వెంకటరమణ



ఆర్‌పీఎఫ్ సీఐ వెంకటరమణను సత్కరిస్తున్న అధ్యాపకులు

అగనంపూడి., సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని ఆర్‌పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులకు సూచించారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైల్లో ప్రయాణించేటప్పుడు ఎలాంటి సహాయం కావాలన్నా 139 నంబర్‌కు సంప్రదించాలన్నారు. నడుస్తున్న రైలు నుంచి దిగడం, ఎక్కడం, మెట్లవద్ద కూర్చోవడం, నిలబడడం, ప్రయాణికులకు అసౌకర్యం కల్పించడం చేయరదని సూచించారు. అలాగే పరిచయం లేని వ్యక్తులు ఆహార పదార్థాలు, పానీయాలు ఇచ్చినా తీసుకోవద్దన్నారు. అనంతరం విజ్ఞాన్ ప్రిన్సిపాల్ సీఐను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించకపోతే లైసెన్స్ రద్దు: సీఐ

పెందుర్తి, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలని ట్రాఫిక్ సీఐ సురేశ్, ఎస్‌ఐ నరసింగరాజు అన్నారు. శుక్రవారం పెందుర్తి, చినముషిడివాడ, సుజాతానగర్ జంక్షన్లలో వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే లైసెన్స్ రద్దుకు డీటీవోకి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వైశాఖి నృత్యోత్సవం

- మైమరిపించిన కేరళ, ఒడిస్సీ సంప్రదాయ నృత్యాలు



నృత్యప్రదర్శన చేస్తున్న కళాకారులు



అనుపమ మోహన్‌కు అవార్డు ప్రదానం చేస్తున్న అతిథులు

మద్దిలపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం 17వ వైశాఖి నృత్యోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మరకత మణిమయ, చేల ఉత్తుకాడు వెంకటకవి కృతులకు కేరళ కూచిపూడి కళాకారిణి డాక్టర్ పద్మిని కృష్ణన్ ప్రదర్శించిన నృత్యాలు మైమరిపించాయి. ఒడిస్సీ కళాకారిణి విద్యూషి కవిత ద్వివేది బృందం ప్రదర్శించిన పంచాక్షర స్తోత్రం, ఆదిశంకరాచార్యులు వచనం చేసిన ఓం నమశ్శివాయ శంకరాభరణం రాగం ఏక తాళం పల్లవి శుద్ధ నృత్యం ఆహూతులను రంజింపజేసింది. గీత గోవిందంలోని అష్టపది-నిందితి చందన, జయదేవ గీతగోవిందం నుంచి విష్ణావతారాలు ప్రదర్శించి అబ్బురపరిచారు. తెలంగాణకు చెందిన ఒగ్గు రవికుమార్ బృందం ఒగ్గు డోలు విన్యాస ప్రదర్శనలకు ప్రాంగణం కరతాళధ్వనులతో మార్మోగింది. మల్లన్న, బీరప్ప కథలతో పాటు ఉత్సాహభరితమైన విన్యాసాలు ప్రదర్శించి ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా కళాకారులకు, అతిథులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కేరళ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ ఎక్స్‌లెన్స్ అవార్డు, పద్మినీ కృష్ణన్‌కు వైశాఖి ఎక్స్‌లెన్స్ అవార్డు, కవిత ద్వివేదికి నాట్యశ్రీ అవార్డు, ఒగ్గు రవికుమార్‌కు డాక్టర్ సరోజా వైద్యనాథన్ యువ పురస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. ఉత్సవాలను విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి సుదగాని రవిశంకర్ నారాయణ్, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ఉషశ్రీ, ఆదాయ పన్నులశాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ మహ్మద్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వైశాఖి నృత్యోత్సవం దేశంలో ప్రముఖ సాంస్కృతిక వేదికగా గుర్తింపు పొందడం విశాఖకు గర్వకారణమన్నారు. కళలను భావితరాలకు అందిస్తున్న విక్రమ్‌గౌడ్‌ను అభినందించారు.

సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీ ఆందోళన



సీఎండీ పృథ్వీతేజ్‌కు నోటీసును అందిస్తున్న డిస్కం జేఏసీ నాయకులు

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రజేఏసీ పిలుపుమేరకు ఏపీఈపీడీసీఎల్ లో ఆందోళనా కార్యక్రమాలు చేస్తామని సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడికి శుక్రవారం డిస్కం జేఏసీ నాయకులు నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని లేకుంటే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. అప్పటికీ స్పందించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని నోటీసులో పేర్కొన్నారు. 1999 ఫిబ్రవరి1 నుంచి 2004 మధ్యకాలంలో చేరిన ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి జీపీఎస్ సౌకర్యం కల్పించాలని, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగాలు కల్పించాలని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, వేతనాలు సంస్థ నుంచే నేరుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి స్పందించిన సీఎండీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డులోని పలుగ్రామ ఆల్లో రూ. 5.35 కోట్ల వ్యయంతో చేపట్టన్ను అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధి కుంటి పడిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పరుగులు తీస్తోందని అన్నారు. వార్డులోని రూ.5.35 కోట్ల వ్యయంతో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, ప్రహరీలు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్టు చెప్పారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని అన్నారు. దశలవారీగా అభివృద్ధి గ్రామాల్లో అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నామని, ఈ సదర్భంగా గ్రామాల్లో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, స్థానిక కూటమి నేతలు పాల్గొన్నారు.

విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్

అగనంపూడి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో 'భవిష్యత్తు తరానికి ఉపాధి అవకాశాల కల్పన' అనే అంశంపై శుక్రవారం సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆర్కిటెక్ట్ చంద్రశేఖర్ పసుమర్తి కార్యక్రమానికి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషిన్ లెర్నింగ్ రంగాల్లో ఇప్పుడున్న పరిణామాలు, భవిష్యత్తులో అవకాశాలు గూరించి వివరించారు. ఇంటెలిజెన్స్ రంగంలో ఏ విధంగా నైపుణ్యం పెంచుకోవాలనే అంశాలపై వివరిస్తూ సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం

పెదగంట్యాడ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి అనుబంధంగా నిర్మించిన పబ్లిక్ హెల్త్ యూనిట్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించనున్నారు. స్థానిక ప్రజలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అందుబాటులో ఉన్నది కానీ వైద్య పరీక్షలు చేయించుకోవడానికి లేబరేటరీ మాత్ర లేదు. దీంతో ప్రైవేటు లేబరేటరీలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి అనుసంధానంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు వీలుగా రూ.50 లక్షల వ్యయంతో పబ్లిక్ హెల్త్ యూనిట్ పేరిట ఒక లేబరేటరీ భవనాన్ని నిర్మించారు. ఈ భవనం శనివారం ప్రారంభం కానుంది. దశలవారీగా లేబరేటరీలో ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేసి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయనున్నారు.

ఉక్కు ఆస్పత్రిలో సేవలు మెరుగుపరచాలి

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉక్కు జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవలు మరింత మెరుగుపరచాలని ఇంటక్ జిల్లా అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు డిమాండ్ చేశారు. ఈ మధ్య కాలంలో చాలా మంది ఉద్యోగులు వీఆర్‌ఎస్, పదవి విరమణ చేయడంతో చాలా వరకు వైద్య సేవలు తగ్గిపోయాయన్నారు. వైద్యులను నియమించి పూర్తి స్థాయిలో సేవలు అందించి, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అదే విధంగా పెదగంట్యాడ ఆస్పత్రిని పూర్వం మాదిరిగా నడపాలని కోరారు.

లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్‌వేర్ ఎగ్జిబిషన్



కుక్‌వేర్ ఎగ్జిబిషన్

రామ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 12 నుంచి 18 వరకు రామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో సత్వ నేచురల్స్ కుక్ వేర్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌ను నిర్వహిస్తున్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ బ్రాండ్ ఇండస్ వ్యాలీ ప్రొడక్ట్‌లు వండర్ చెఫ్ ప్రొడక్టులు తగ్గింపు ధరలతో విక్రయిస్తున్నట్టు నిర్వాహకులు వనకూరి లక్ష్మి తెలిపారు అలాగే అల్యూమినియం వంట పాత్రల ఎక్స్ఛేంజ్‌పై అదనపు తగ్గింపు ఇస్తున్నట్టు చెప్పారు. స్టీల్, కాస్ట్ ఐరెన్ ,సిరామిక్, ఇత్తడి వంట పాత్రలు. గాజు, రాతి చెక్క వంటి పనిముట్లు, ఇతర ఆర్గానిక్ పనిముట్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు, వివిధ స్టాళ్లపై డిస్కౌంట్ ఉన్నాయని, ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా చిరుదాన్యాలతో చేసిన చిరుతిండ్లు విక్రయిస్తున్నట్టు తెలిపారు. అలాగే సందర్శకులకు లక్కీ డ్రా నిర్వహించి బహుమతులు అందజేస్తున్నట్టు లక్ష్మి తెలిపారు.

హైమాస్ట్ లైట్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతుల అనంతరం హైమాస్ట్ లైట్లు

వేపగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బాజీజంక్షన్ నుంచి పాతగోపాలపట్నం వెళ్లే మార్గంలో ఉన్న హైమాస్ట్ వీధి దీపాలు పగటిపూట వెలగకుండా సంబంధిత అధికారులు మరమ్మతులు చేశారు. 'పట్టపగలే వెలుగులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ లైన్లను మార్పు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డ్వాక్రా సమావేశాలకు వేదిక కోసం వినతి

- ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళతానని కార్పొరేటర్ హామీ

వేపగుంట, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 93వ వార్డు ప్రహ్లాదపురంలో ఉన్న డ్వాక్రా గ్రూపు మహిళలు తమ సమావేశాలు పెట్టుకోవడానికి సరైన భవనం లేదని, చెట్ల కింద పెట్టుకుంటున్నామని, తమకు సొంత భవనాన్ని, కానీ వేదికను కానీ నిర్మించాలని కార్పొరేటర్ రాపర్తికన్నాకు వినతి పత్రాని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ సమస్యను ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రాపర్తి శైలజ, ఆర్పి కమలాదేవి తదితరులు పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన సబ్‌ప్లాన్ నిధులను కేటాయించాలి

- దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

ఉక్కుటౌన్‌షిప్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను జనాభా ప్రాతిపదికన అమలు చేయాలని దళిత హక్కు ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవీ.ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఉక్కు సీఐటీయూ కార్యాలయంలో కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్)ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే తెరవాలని, డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యా యం సరిచేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయం లో కేంద్రం కుట్రపూరితంగా వ్యవహరి స్తోందన్నారు. కేవీపీఎస్ గౌరవాధ్యక్షుడు వైటీ. దాసు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగే విధంగ ప్రభుత్వాలు ముందుకు సాగాలన్నారు. సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎగ్ కార్టులతో మహిళలు ఆర్థికంగా ఎదగాలి: పీడీ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

సాగర్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళలు ఎగ్‌కార్టులు వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన సాగర్‌నగర్ సన్ ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం, మేనేజ్‌మెంట్‌లో 50 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్టులు పంపిణీ చేశారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌ఈసీసీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలు ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారితే మరో 50 మందిని తయారుచేయవచ్చునన్నారు. ఎన్‌ఈసీసీ ట్రస్టీ బి.రామారావు కోడిగుడ్డు వినియోగించి 247 రకాల వంటకాలు చేయవచ్చునన్నారు. మరో వక్త అరవింద్ ఉత్తరాంధ్రలోని ఐదు జిల్లాలకు చెందిన 50 మంది మహిళలకు 18 రకాల వంటకాల తయారీపై శిక్షణ ఇచ్చినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సన్ ఇనిస్టిట్యూట్ ఈడీ ఆశా జాస్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఆరిలోవ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఈనెల 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల కార్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థి ఆధార్‌కార్డులో ఉన్న విధంగా పేరు, పుట్టిన తేదీ, సమయం, తండ్రి పేరు నమోదుచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం 3.5 లక్షల లోపున్న విద్యార్థులు అర్హులన్నారు. పరీక్ష రాసే సమయానికి అన్ని ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. వివరాలకు ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ లేదా డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గోస్తనీకి పోటెత్తిన వరద


- నదీ పరీవాహక ప్రాంత వాసుల్లో ఆందోళన
- నిండుకుండలా తాటిపూడి జలాశయం
- నీటిని విడుదల చేసేందుకు అధికారుల సన్నాహాలు
- లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన యంత్రాంగం

భీమునిపట్నం (రూరల్) సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గోస్తనీనది వరద నీటితో పోటెత్తుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదీ పరీవాహర ప్రాంత వాసుల్లో భయం నెలకొంది. తాటిపూడి రిజర్వాయరులో నీటి మట్టం ప్రమాదస్థితికి చేరుకుందని అధికారులు తెలిపారు. దీంతో నీటిని దిగువకు విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో గోస్తనీలో వరద ప్రవాహం మరింతగా పెరుగుతుందని భావిస్తున్నారు. ఒకేసారి నీరు పెరిగితే నదీ తీర ప్రాంత గ్రామాల్లోకి చొచ్చుకు వస్తుందనే ఆందోళన నెలకొంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల వాసులు ఆందోళన చెందుతున్నారు. అనంతగిరి కొండల్లో పుట్టిన


తాటితూరు, నగరపాలెం మధ్యలో పంట పొలాల్లో చేరిన నది నీరు

గోస్తనీనది విజయనగరం జిల్లా జామి మండలం తాటిపూడి జలాశయంలోకి చేరి, అక్కడి పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండలాల మీదుగా ప్రవహించి భీమిలి వద్ద సముద్రంలో కలుస్తుంది. నది ఉధృతంగా మారడంతో ఇప్పటికే తాటితూరు, నగరపాలెం, నాగమయ్యపాలెం, మూలకుద్దు, సామేయవలస, పాండ్రంగి తదితర గ్రామాల పరిధిలోని పొలాల్లోకి నీరు చేరింది. తాటిపూడి జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తే నది మరింత పోటెత్తుతుంది. నదికి రెండు వైపులా గట్టు లేకపోవడంతో ప్రవాహం లోతట్టు ప్రాంతాలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భీమిలి తహశీల్దారు పైల రామారావు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.


తగరపువలస వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది


తాటిపూడి రిజర్వాయరు వద్ద ప్రవహిస్తున్న నీరు

నిండిన తాటిపూడి జలాశయం

గోస్తనీ నదిపై ఉన్న తాటిపూడి జలాశయం పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికి చేరిందని విజయనగరం జిల్లా ఇరిగేషన్ శాఖ ఈఈ రాజారావు తెలిపారు. రిజర్వాయరులో గరిష్ఠ నీటిమట్టం 297 అడుగులు కాగా ప్రస్తుతం 295.5 అడుగుల నీరుందన్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో 480 క్యూసెక్కుల వరద వస్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే జలాశయం గేట్లను ఎత్తి కనీసం 100 క్యూసెక్కుల నీటిని శుక్రవారం రాత్రికే దిగువకు విడుదల చేస్తామన్నారు. దీంతో నదీ పరీవాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏయూలో జాతీయస్థాయి సైన్స్ కాంక్లేవ్

వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయస్థాయి సైన్స్ కాంక్లేవ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకోసం మూడు జాతీయ సంస్థలు సహకరించేందుకు ముందుకు వచ్చాయని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ తెలిపారు. వర్సిటీ శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో విస్తృత స్థాయి సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. రానున్న కాలంలో నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రణాళికలపై చర్చించారు. ప్రిన్సిపల్స్, డీన్లు, ప్రొఫెసర్ల సూచనలతో భవిష్యత్తు కార్యక్రమాల ప్రణాళికను సిద్ధం చేశారు. శతాబ్ది సంవత్సరాన్ని ప్రతిబింబిస్తూ ప్రత్యేకంగా నాణెం, పోస్టల్ స్టాంప్, కవర్ వంటివి తీసుకురానున్నామన్నారు. ప్రయోగశాలలను చిన్నారులు, యువతకు పరిచయం చేసేలా ఓపెన్ హౌస్ నిర్వహిస్తామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ, పాల్గొన్న అధికారులు

జాతీయ సైన్స్ డేలో విద్యార్థులను భాగస్వాములను చేయాలని, విభిన్న అంశాల్లో పోటీలు నిర్వహించాలని సూచించారు. ఉత్సవాలకు అవసరమైన నిధులు కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతామన్నారు. సుమారు రూ.170 కోట్ల వ్యయంతో హాస్టల్స్, మౌలిక సదుపాయాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి పూర్వోదయ పథకంలో ప్రతిపాదనను పంపామన్నారు. సౌత్ ఇండియా ఇంటర్ వర్సిటీ పురుషుల క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు నిర్ణయించారు. ఆల్ ఇండియా ఇంటర్ వర్సిటీ రోలర్ స్పోర్ట్స్ మీట్-2025, ఇంటర్ కాలేజియేట్ స్పోర్ట్స్, అథ్లెటిక్స్ పోటీలను, వాలీబాల్‌పై రీజనల్ వర్క్‌షాప్ నిర్వహిస్తామని క్రీడా విభాగం సంచాలకులు ప్రొఫెసర్ విజయమోహన్ ఈ సందర్భంగా వివరించారు. జాతీయ సేవా పథకం సహకారంతో ఒక మెగా కార్యక్రమాన్ని, మెగా స్టార్టప్ చాలెంజ్ కార్యక్రమాన్ని ఏయూ ఆ హబ్ సౌజన్యంతో నిర్వహించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎస్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, ప్రిన్సిపాల్స్, డీన్లు, డైరెక్టర్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ జోనల్ కార్యాలయాలు ప్రారంభం


కార్యాలయాలు ప్రారంభిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం వీఎంఆర్‌డీఏ అనకాపల్లి, విజయనగరం జిల్లా కేంద్రాల్లో నిర్మించిన జోనల్ కార్యాలయాలను వర్చువల్‌గా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ శుక్రవారం ప్రారంభించారు. విజయనగరంలో భవన పునర్నిర్మాణానికి రూ.47.95 లక్షలు, అనకాపల్లిలో రూ.33.5 లక్షలు ఖర్చు చేశామన్నారు. వీటిలో అధికారులు సేవలందిస్తారన్నారు. సెక్రటరీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేర్‌లో తొలి రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీ విజయవంతం

ఆరిలోవ, సెప్టెంబరు 12, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలి రోబోటిక్ పాంక్రియాటిక్ సర్జరీని ఆరిలోవ హెల్త్ సిటీలోని కేర్ ఆస్పత్రి వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ వివరాలను ఆస్పత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆస్పత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ అండ్ రోబోటిక్ సర్జరీ విభాగం క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ బిశ్వబసుదాస్ మాట్లాడుతూ తీవ్రమైన కడుపు నొప్పి, బరువు తగ్గడం వంటి సమస్యలతో బాధపడుతూ కొద్దిరోజులు కిందట జి. శేషగిరిరావు (65), కె.శుభమణి (52) ఆస్పత్రికి వచ్చారన్నారు. వీరికి పరీక్షలు నిర్వహించగా బ్లాడర్ వద్ద పెద్ద గడ్డలున్నట్టు తేలిందన్నారు. మరిన్ని లోతైన పరీక్షలు నిర్వహించగా పాంక్రియాస్ కేన్సర్ గడ్డలుగా గుర్తించామని, వీరికి పూర్తిగా రోబోటిక్ విధానంలో శస్త్ర చికిత్సలను నిర్వహించి గడ్డలను తొలగించామన్నారు. ఈ తరహా శస్త్రచికిత్సను రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించామన్నారు. దీనిని విప్పల్ పాంక్రియాటిక్ కేన్సర్ సర్జరీగా పేర్కొంటారన్నారు. ఈ తరహా సమస్యలకు సాధారణ శస్త్రచికిత్స పద్ధతులను అనుసరిస్తే పది నుంచి 12 అంగుళాల కోత పెట్టాల్సి వస్తుందని, దీనివల్ల రక్తస్రావం అధికంగా జరుగుతుందన్నారు. కోలుకునేందుకు సమయం ఎక్కువ పడుతుందని వివరించారు. రోబోటిక్ సర్జరీతో చిన్నపాటి కోతతో శస్త్రచికిత్స పూర్తి చేయడంతోపాటు 24 గంటల్లో రోగి కోలుకుని డిశ్చార్జ్ చేశామన్నారు. సమావేశంలో శస్త్రచికిత్స చేసిన సర్జన్లు డాక్టర్ దుర్గా భవాని, డాక్టర్ సందీప్ సాహూ తదితరులు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న హెల్త్‌సిటీ కేర్ ఆస్పత్రి వైద్యులు

17 నుంచి స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 17 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జిల్లాలో స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. ప్రోగ్రామ్ అమలుకు సంబంధించి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. స్త్రీలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతోపాటు కొన్ని వ్యాధులకు అందించే చికిత్స, పరీక్షల నిర్వహణ, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలు అందుబాటులోకి తీసుకు రావడం వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామీణ, పట్టణ, సామాజిక, ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలు, జిల్లా వైద్య కళాశాలలు, ఆస్పత్రుల ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల కేంద్రీకృత ఆరోగ్య శిబిరాలను నిర్వహించాలన్నారు. నాన్ కమ్యూనికబుల్ డిసీజ్‌లు, క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లీపిల్లల రక్షణ, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్, రుతు పరిశుభ్రత, టీబీ స్క్రీనింగ్ చేయాలన్నారు. దీనిని సీఎం చంద్రబాబునాయుడు ఈ నెల 17న ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్, ఐసీడీఎస్ పీడీ, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, రెడ్ క్రాస్ అధికారులు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ: డీఐజీ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఏజెన్సీలో పూర్తిగా గంజాయి నిర్మూలనపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించి అమలుచేయాలని రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి ఆదేశించారు. శుక్రవారం రేంజ్ కార్యాలయంలో వివిధ జిల్లాల ఎస్పీలతో సమీక్షించారు. గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్న నేపథ్యంలో ఇప్పటి వరకు 14 మంది నిందితుల నుంచి రూ.10.04 కోట్ల ఆస్తులు స్వాధీనం చేసుకోవడం అభినందనీయమన్నారు. ఇంకా 1,119 మంది నిందితులపై షీట్లు తెరవడం, 51 మందిపై పీడీ యాక్టు, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుచేయడానికి ప్రతిపాదించామన్నారు. తరచుగా గంజాయి రవాణాచేసే 368 మంది, ఇతర నేరాలతో సంబంధం ఉన్న 370 మందిని గుర్తించామన్నారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిల్‌బుల్ వారెంట్ల ఆధారంగా 341 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు కోర్టులు శిక్షలు విధించాయని, వీరిలో 24 మందికి 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. రేంజ్ పరిధిలో టెక్నాలజీ వినియోగించి పరారీలో ఉన్న నిందితుల్ని పట్టుకున్న అధికారులను అభినందించారు. భవిష్యతు కార్యాచరణలో భాగంగా గంజాయి రవాణా మార్గాలను అధ్యయనంచేసి అరికట్టే వ్యూహం రూపొందించాలని డీఐజీ సూచించారు. శాంతి భద్రతల సమస్యలు అధిగమించడానికి కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలన్నారు. సమీక్షలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, వకుల్ జిందాల్, తుహిన్ సిన్హా, అమిత్‌బర్దర్ పాల్గొన్నారు.


రేంజ్ ఎస్పీలతో సమీక్షిస్తున్న డీఐజీ గోపినాథ్ జట్టి

ఆభరణాల లెక్కలు మేమే చెబుతాం: సింహాచలం ఏఈఓ రాధ

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సింహాచలం దేవస్థానంలో ఆభరణాల లెక్కలను ప్రస్తుతం ఐదుగురు సభ్యుల కమిటీ తనిఖీ చేస్తున్నదని, నివేదిక పూర్తయిన తరువాత ఆ వివరాలను తామే పత్రికాముఖంగా తెలియజేస్తామని ఏఈఓ రాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశం ఇంకా విచారణలో ఉండగానే "సింహాచలం సిరి గల్లంతు" అంటూ "ఆంధ్రజ్యోతి"లో కథనం ప్రచురించడం వల్ల దేవస్థానం ప్రతిష్ఠకు భంగం కలిగిందని పేర్కొన్నారు. ఆభరణాల లెక్కలలో తేడాలు ఉండటం వల్లనే జేఈఓ ఇచ్చిన నివేదికను పక్కన పెట్టి మరో కమిటీని వేశారని పరోక్షంగా అందులో పేర్కొన్నారు. చందనోత్సవం ముగిసిన వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆదేశిస్తే నాలుగు నెలలైనా విచారణ ఎందుకు పూర్తి చేయలేకపోయారో, ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారో అందులో వెల్లడించలేదు. ఈ జాప్యం వల్ల దేవాలయం పనితీరుపై ప్రజల్లో ఎలాంటి భావన కలుగుతుందో వివరించలేదు.


బ్యాంకులో ఆభరణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొనసాగిన తనిఖీలు

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆభరణాలను ఫైవ్‌మన్ కమిటీ శుక్రవారం తనిఖీ చేసింది. బ్యాంకు లాకర్లలో భద్రపరిచిన, ఉపాలయం వేంకటేశ్వర స్వామి ఆలయ ఆభరణాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు.

క్రైం... crime news

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య


తేజ (ఫైల్ ఫొటో)

గోపాలపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అడిగిన వెంటనే బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శుక్రవారం చంద్రనగర్‌లో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గ్రేటర్ 89వ వార్డు చంద్రనగర్‌కు చెందిన కరణం తేజ (21) ప్రైవేటు పనులు చేస్తుంటాడు. తనకు బైక్ కొనుగోలు చేయాలని కొద్ది రోజులుగా తల్లిదండ్రులను అడుగుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారు కొనలేదు. దీంతో మనస్తాపం చెందిన తేజ శుక్రవారం మధ్యాహ్నం 4 గంటల సమయంలో చంద్రనగర్‌కు సమీపంలో ఉన్న రైలుట్రాక్‌పై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాపర్లను ఢీకొట్టిన కారు

నలుగురికి గాయాలు...ఇద్దరి పరిస్థితి విషయం

షీలానగర్-కాన్వెంట్ జంక్షన్ రహదారిలో ప్రమాదం

మల్కాపురం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో అడ్డుగా ఉంచిన సిమెంటు స్టాపర్లను ఓ కారు ఢీకొట్టడంతో నలుగురు ప్రయాణికులు గాయపడగా, వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం మారుతి సర్కిల్ వద్ద శుక్రవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని సీతంపేటకు చెందిన శ్రీజర్ ఉషా శ్రీదేవి (64), ఏలేశ్వరం వెంకట రత్నపాప (70), రాజు, సీతామహాలక్ష్మిలకు అచ్యుతాపురంలో ఓ కంపెనీ ఉంది. అక్కడ పూజలు చేసేందుకు శుక్రవారం ఉదయం నగరం నుంచి కారులో బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్‌కు వస్తుండగా మారుతి సర్కిల్ సమీపంలో వాహనం రోడ్డు నిర్మాణ పనుల నేపథ్యంలో అడ్డుగా ఉంచిన స్టాపర్లను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులోని నలుగురూ గాయపడ్డారు. వారిలో శ్రీజర్ ఉషా శ్రీదేవి (64), ఏలేశ్వరం వెంకట రత్నపాప (70)లను షీలానగర్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. క్షతగాత్రుల్లో మరో ఇద్దరు రాజు, సీతామహాలక్ష్మిలను కేజీహెచ్‌కు తరలించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న శ్రీదేవి, రత్నపాప

రెండు కేజీల లిక్విడ్ గంజాయి పట్టివేత


పట్టుబడిన నిందితులతో పోలీసులు

పెందుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై నగరంలోకి తరలిస్తున్న రెండు కేజీల లిక్విడ్ గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రెండు బైకులు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... సరిపల్లి చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా రెండు బైక్‌లపై ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి తనిఖీ చేయగా గుట్టుగా భద్రపరిచిన లిక్విడ్ గంజాయి లభ్యమైంది. దీంతో అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరికి చెందిన దుంబరి జోయి, నమరాడి అర్జున్, దుంబరి స్వామిలను అరెస్టు చేశారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

పెందుర్తి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ సూరిబాబు తెలిపిన వివరాల మేరకు.. కృష్ణరాయపురానికి చెందిన ఉమ్మిడిశెట్టి భవానీ శంకర్ ఫ్లవర్ డెకరేషన్ పనులు చేస్తుంటాడు. ఈనెల 2న రాత్రి పది గంటలకు రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాన్ని తన ఇంటి వద్ద పార్క్ చేశాడు. ఉదయం కనిపించలేదు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేశారు. విజయనగరం జిల్లాఎస్.కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కక్కుల మణికంఠ (20), వేపాడకు చెందిన కవల జ్ఞానేంద్రసాయి (22), కణితి భానుప్రకాశ్ (19) చోరీ చేసినట్టు గుర్తించి, వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. బుల్లెట్‌తో మరో రెండు ద్విచక్ర వాహనాలు చోరీ చేసినట్టు అంగీకరించడంతో వారిని అరెస్టు చేశారు.

వైద్యుల సిఫార్సుతోనే మందులు విక్రయించాలి

» డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయకుమార్


సదస్సును ప్రారంభిస్తున్న అధికారులు

రామ్‌నగర్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రిస్క్రిప్షన్ లేకుండా నార్కోటిక్ డ్రగ్స్, యాంటీబయోటిక్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విశాఖపట్నం డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ హెచ్చరించారు జిల్లా డ్రగ్ ట్రేడ్ అసోసియేషన్ స్మార్ట్ విశాఖ కెమిస్ట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం విశాఖ చిల్డ్రన్స్ ఎరీనాలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అండ్ నార్కోటిక్ సైకోట్రోపిక్ నార్కోటిక్ డ్రగ్స్ దుర్వినియోగంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా మెడికల్ షాపులపై ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయని, గీతం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత యాంటీబయోటిక్స్ వినియోగంపై అవగాహన కల్పించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసరావు ఆన్ లైన్ డ్రగ్ లైసెన్సింగ్ సిస్టమ్ వివరించారు. సమావేశంలో డ్రగ్ కంట్రోల్ అధికారులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కూన కళ్యాణి, ఇందిరా భారతి, ఎస్.కళ్యాణి 650 మంది ఫార్మాసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

వాహనమిత్రపై ఆటోడ్రైవర్ల సంబరాలు


కూర్మన్నపాలెంలో పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల వద్ద సంబరాలు

కూర్మన్నపాలెం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకం కింద దసరా రోజున ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో సంబరాలు జరుపుకున్నారు. వడ్లపూడిలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కూర్మన్నపాలెం ఎన్టీఆర్ జంక్షన్ వద్ద కూటమి నేత నల్లూరు సూర్యనారాయణ ఆధ్వర్యంలో పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చిత్రపటాల వద్ద కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, కాదా శ్రీను, వేగుంట శ్రీను, రాజన్‌రాజు, బి.జగదీష్, కె.రమేష్, లోవరాజు, ఆటోడ్రైవర్లు సూరిబాబు, ఎ.శ్రీనివాసరావు, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.